# విశ్వ ప్రార్థన

**శ్రీ స్వామి శివానంద**

ॐ

విశ్లేషణ కర్త్రి

**స్వామిని వినమ్రానంద**

**శ్రీశాంతి ఆశ్రమము,**

**తోటపల్లి కొండలు, ఆం.ప్ర.**

ప్రథమ ప్రచురణ 2003
ద్వితీయ ప్రచురణ 21-1-2017 శ్రీశాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాలు 21-1-2016 - 21-1-2017 సందర్భంగా
ప్రతులు : 1000
ప్రకాశకులు :
**దివ్యజీవన సంఘము,**
శివానంద నగర్, ఋషీకేషము, టెహ్రీగఢ్ వాల్ జిల్లా.
ఉత్తరాఖండ్ - **249192**
ప్రతులకు :
**ద మిషన్ ఆఫ్ పీస్ శ్రీ శాంతి ఆశ్రమము**
**తోటపల్లి కొండలు వయా శంఖవరం 534 446**
**తూ॥గో॥జిల్లా. ఆం.ప్ర.**
**ఫోన్ న్ర 7382009962**

సర్వహక్కులు ప్రకాశకులవి.

ముద్రణ :
మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమండ్రి.


## కృతజ్ఞతాభివందనములు

ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయం అందించిన వారు

**శ్రీ కోలా సత్యనారాయణమూర్తి**, మాతృఆశ్రమం.

వీరికి వీరి కుటుంబ సభ్యులకు భగవంతుని ఆశీస్సులతోపాటు, బ్రహ్మలీన పరమపూజ్య శ్రీ ఓంకారస్వామి, పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారు ఆశీస్సులు అనుగ్రహించుగాక!

- శ్రీశాంతి ఆశ్రమ యాజమాన్యం




గురుదేవులు పూజ్యశ్రీ

**స్వామి శివానందవారు**

**(1887-1963)**

**దివ్య జీవన సంఘం స్థాపకులు, ఋషీకేశము.**



గురు మహరాజ్ పూజ్యశ్రీ స్వామి

**చిదానంద వారు**

**( 1916-2008 )**

---

పూజ్యశ్రీ చిదానంద స్వామివారి ప్రేరణ మరియు ఆశీర్వాదముచే
వ్రాయబడిన ఈ వ్యాఖ్య వారి దివ్య పాద పద్మముల చెంత
సమర్పిస్తున్నాను.

– స్వామిని వినమ్రానంద సరస్వతి

# విశ్వప్రార్థన యొక్క ప్రాముఖ్యత

విశ్వప్రార్థన అన్నా, లోకప్రార్థన అన్నా, విశ్వేశ్వర ప్రార్థన అన్నా, లోకేశ్వర ప్రార్థన అన్నా ఒకే అర్థము. విశ్వమానవ కళ్యాణము కొరకై **శ్రీసద్గురు శివానంద స్వాములవారు ఈ "విశ్వప్రార్థన"ను మనముందుంచిరి.** విశ్వప్రార్థన పరమేశ్వరుని సర్వవ్యాపకత్వము, సర్వశక్తి మత్వమును, సర్వజ్ఞత్వమును సూచించును. ఇది తనకు శ్రద్ధ, భక్తి ప్రజ్ఞలను ప్రసాదించమని భగవంతుని ప్రార్థించును. అహంకారము, కామము, లోభము, క్రోధము, ఈర్ష్య, ద్వేషము ఇత్యాది దుర్గుణముల బారినుండి తప్పింపుమని అర్థించును. నన్ను నీయందే వసింపజేయుమని దేవునితో విన్నవించు కొనును.

ఈ విశ్వప్రార్థనను ప్రతినిత్యము పఠించుటచే హృదయము పవిత్ర మగును. మనస్సు నిష్కల్మషమగును. సర్వత్ర భగవంతుని దర్శింపగలుగు సామర్థ్యమేర్పడును. భగవంతుని విశ్వరూపమును దర్శించు భాగ్యము కలుగును. భగవత్సాక్షాత్కారానుభవ మునకు పునాది ఏర్పడును. ఇట్లు ఆధ్యాత్మిక మార్గము సుగమమగును.

ఇట్టి విశ్వప్రార్థనకు పూజ్యశ్రీ స్వామిని వినమ్రానంద సరస్వతి వారు సలలితమగు వ్యాఖ్యను వ్రాసియున్నారు. ఈ వ్యాఖ్యను బ్రహ్మలీన శ్రీదేవానంద స్వాముల వారు "శ్రీ శివానంద వాణి"లో ప్రచురించియుండిరి. ఈ వ్యాఖ్యను పఠించుటచే విశ్వప్రార్థన యందిమిడియున్న గంభీరమైన భావార్థము మనకు అవగత మగును. ఏ తత్పుస్తక పఠనము ఆత్మజ్ఞానోదయ మునకు దోహదమొసంగును.

**"కర్తా కారయితా చైవ ప్రేరకశ్చాను మోదకః"** అనునట్లు "ఏ కార్యమునైనను చేయువాడు, చేయించువాడు, ప్రేరణ చేయువాడు, చూచి సంతోషపడువాడు ఈ నలుగురు సమభాగస్థులు".కావున ఈశ్వరానుగ్రహము రచయిత్రికి, ముద్రింపించువారికి, ప్రేరణ మొసంగినవారికి, పఠించి ప్రమోదము నొందు వారికందరికిని కలుగు ననుటలో సందేహములేదు. ఏతద్గ్రంథమును పఠించి, పాఠకులు లాభాన్వితులగుదురు గాక !

ఓం తత్సత్ ఓమ్ !

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇట్లు

**- స్వామి హంసానంద**

# విన్నపము

భగవత్ స్వరూపులైన పూజ్య చిదానంద స్వామీజీ వారి పాదపద్మములకు సాష్టాంగ ప్రణామములు అర్పిస్తూ నా విన్నపమును విన్నవించుకుంటున్నాను.

సర్వమానవాళి శ్రేయస్సును అభిలషిస్తూ మృదు మధురమైన శైలిలో వేదాంతసారమును విశ్వప్రార్థన ద్వారా పరమ గురువులైన బ్రహ్మలీనులైన పూజ్యశ్రీ శివానందస్వామిజీవారు అందించిరి. ప్రార్థన అంటే భగవంతుని దగ్గర స్వార్థపూరిత మైన కోరికలను అర్థించడము కాదు. జీవభావము అంతరించి పరమాత్మలో లీనమవ్వుటకు చేయు ప్రయత్నము ఏదయితే వున్నదో అదియే నిజమైన ప్రార్థన.

"సర్వస్య చాహం హృది సన్నివిష్టః" (భగవద్గీత15-15) "నేను అందరి హృదయ ములలో ప్రవేశించి వున్నాను" అని గీతాచార్యులు అన్నట్లు సర్వజీవ హృద యాంతరాలలో నివసిస్తున్న పరమాత్మ యొక్క సర్వజ్ఞత్వాన్ని, సర్వవ్యాపక తత్త్వాన్ని ఈ విశ్వప్రార్థన ద్వారా సూచించారు. ఈ ప్రార్థన కేవలము ఒక వ్యక్తికి చెందినది మాత్రమేకాదు. సర్వజీవులు ఈ ప్రార్థనను మనస్ఫూర్తిగా ప్రార్థించిన యెడల మనలో దైవీసంపత్తి కలిగి, సర్వవ్యాపకమైన పరమాత్మలో లీనమవుటకు తగిన ఆధ్యాత్మిక శక్తి లభిస్తుంది. అటువంటి ఆధ్యాత్మిక శక్తిని గురుదేవులు ప్రసాదించుగాక ! "విశ్వప్రార్థన" వ్యాఖ్యను ముద్రించుటకు పూజ్యశ్రీ చిదానంద స్వామీజీ వారి అనుమతిని కోరినప్పుడు వారు దయతో ముద్రించవచ్చు నని (పట్టమడైలో) అనుమతిని ప్రసాదించిరి. ఈ చిన్న పుష్పమును బ్రహ్మలీన పూజ్యశ్రీ చిదానంద స్వామీజీ వారి పాదపద్మములకు అర్పిస్తున్నాను.

ఈ వ్యాఖ్యలో వున్న దోషములను నా బుద్ధికి చెందినవిగా గ్రహించి, మంచి వాటిని గురుదేవుల వారివిగా భావించి క్షమించగలరని నా ప్రార్థన. ఈ వ్యాఖ్యను సరిదిద్ది సహకరించిన బ్రహ్మలీనులైన పూజ్యశ్రీ దేవానంద స్వామివారి పాదపద్మములకు, పూజ్యశ్రీ హంసానంద వారి పాదపద్మములకు నమస్కరిస్తూ, ధన్యవాదములు అర్పిస్తున్నాను.

జై గురుదేవ ! శ్రీ సద్గురు చరణారవిందార్పణమస్తు !

ఇట్లు మీ పాద దాసి

**-వినమ్రానంద సరస్వతి**

# పార్థన అంటే ఏమిటి

## ఉపోద్ఘాతం

**శ్లో॥ అనంత సంసార సముద్రతార**
**నౌకాయితాభ్యాం గురుభక్తిదాభ్యాం ।**
**వైరాగ్య సామ్రాజ్యద పూజనాభ్యాం**
**నమోనమః శ్రీ గురు పాదుకాభ్యాం ॥**

సాధారణముగా అందరము ప్రార్థన చేస్తూ ఉంటాము. లౌకికమైన విషయ వస్తువులకోసము,కష్టములు వచ్చినప్పుడు వాటి నివారణ కోసము, మన కోరికలు తీరటం కోసము ప్రార్థనచేస్తూ వుంటాము. మన మందరము పరమాత్మ స్వరూపులమే కాని అజ్ఞానం వలన మన స్వరూపాన్ని మర్చిపోయి బాహ్యమైన అనిత్యమైన సుఖముల కొరకు ప్రార్థిస్తూ ఉంటాము. మన స్వస్వ రూపాన్ని తెలుసుకోవడానికి చేయు ప్రార్థనయే నిజమైన ప్రార్థన.

**జలాది సంసర్కవశాత్ ప్రభూత,**
**దుర్గంధ ధూతాగరు దివ్యవాసనా ।**
**సంఘర్షణే నైవ విభూతి సమ్యగ్,**
**విధూయమానే సతి బాహ్యగంధే ॥** వి.చూ.శ్లో॥ 273

నీటి సంపర్కము వలన అగరుకు దుర్గంధం వస్తుంది. ఆ అగరును ఒక గరుకు రాయి మీద అరగదీస్తే దుర్గంధం పోయి మరల తనదయిన దివ్యమైన పరిమళాన్ని వెదజల్లుతుంది.

**అంతః శ్రితానంత దురంత వాసనా,**
**ధూళీ విలిప్తా పరమాత్మావాసనా ।**
**ప్రజ్ఞాతి సంఘర్షణతో విశుద్ధా,**
**ప్రతీయతే చందన గంధవత్ స్ఫుటా** (వి.చూ. శ్లో॥ 275)

చందనపు కఱ్ఱని నీటిలో కొంతకాలం ఉండనిస్తే మురిగి పోయిన ఆ కఱ్ఱ నుండి దుర్వాసన వస్తుంది. సహజముగా చందనం సువాసన గలది. కాని నీటితో చాలాకాలం సంపర్కం చెందడంతో దివ్యమైన సువాసన

కోల్పోయి దుర్వాసన వస్తుంది. ఆ చందనపు కఱ్ఱని నీటినుండి బయటకు తీసి ఒక రాతికి రుద్దితే మెల్లగా మరల తన సహజ దివ్యమైన పరిమళాన్ని వెదజల్లుతుంది. అదేవిధంగా మనము పరమాత్మ స్వరూపులైనప్పటికి అజ్ఞానం వలన మన స్వరూపాన్ని గుర్తించలేకపోతున్నాము. రుద్దటం వలన చందనానికి మనము సుగంధాన్ని తెచ్చి ఇవ్వడం లేదు. దానిలో సహజంగానే సువాసన ఇమిడి వుంది. రుద్దనంత వరకు మనకు సువాసన అందడంలేదు. ఇదే విధంగా నీకు దివ్యత్వాన్ని ఎక్కడినుండో తెచ్చి ఇవ్వనసరంలేదు. అది నీవే అని ఉపనిషత్తులు ఉద్ఘోషిస్తున్నాయి. ఇక్కడ

చందనం – పరమాత్మ స్వరూపుడైన జీవునితో పోల్చిరి.

నీరు – వాసనలతో పోల్చిరి.

లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన, ఈ మూడు వాసనల ప్రభావం వలన మనలో ఉన్న దివ్యత్వాన్ని గ్రహించడం లేదు. జ్ఞానమనే రాపిడి వలన మనలో దుర్వాసనలు అంతమౌతాయి. అప్పుడు సహజంగా రాపిడి వలన చందనం సువాసన వెదజల్లినట్లుగా మన ఆత్మ స్వరూపం గుర్తించబడు తుంది. ఈ ప్రార్థన వలన వచ్చే లాభమేమిటి? ప్రపంచంలోని మానవుని జీవితమంతా దుఃఖమయమైనదే.

**శ్లో॥ జన్మ దుఃఖం జరాదుఃఖం । జాయాదుఃఖం పునః పునః ।**
**సంసార సాగరం దుఃఖం । తస్మాత్ జాగ్రత్త ! జాగ్రత్త ! ॥** వై.డిండిమము

జన్మదుఃఖము, ముసలితనము దుఃఖము, భార్యాపుత్రాదులు దుఃఖము, జననమరణ సంసార సముద్రంలో బడుటయే దుఃఖము కావున మేల్కొనుము, మేల్కొనుము.

భవసాగరము నుండి ముక్తిని పొందడానికి ఈ ప్రార్థన అత్యవసరము. జీవభావము పోయి పరమాత్మలో లీనమగుటకు ప్రార్థన చేయాలి. ఈ ప్రార్థన ఎంతవరకు చెయ్యాలి అనే సందేహము వస్తుంది. నది దాటే వరకు పడవ అవసరము. దాని తరువాత అవసరములేదు. అదేవిధముగా ఈ జీవభావము నశించే వరకు ప్రార్థన అవసరము. జీవభావము పోయి ఆత్మస్వరూపం పొందిన తరువాత ఈ ప్రార్థన తనంతట తానే ఆగిపోతుంది.

ఉదా–ఒక రోజు భోజరాజు ఆస్థాన మహాసభలో ఎవరు మోక్షానికి పోతారు అని చర్చించుకుంటున్నారు. ఇంతలో మహాకవి కాళిదాసు నేను పోతే పోతాను అన్నారు. తక్కిన పండితులు, కవులు గుస గుసలాడుచున్నారు. కొంత సమయానికి నేను అన్నది ఎప్పుడు పోతుందో అప్పుడు మోక్షానికి పోతాము అన్నాను కాని, నేను పోతాను అనలేదు. అదేవిధంగా జీవభావము పోయే వరకు ప్రార్థన చేయాలి.

పూజ్యశ్రీ శివానంద స్వామీజీ వారు అప్పయ్య దీక్షితార్ మరియు ఇతర మహాపురుషులు జన్మించిన సుప్రసిద్ధ వంశమునందు 1887 సెప్టెంబరు8వ తేదీన జన్మించిరి. స్వామీజీ వారు విశ్వ ప్రార్థన వ్రాసారు. ఈ విశ్వప్రార్థన స్వామీజీవారు అందరిచేత చేయించేవారు. ఈ ప్రార్థన చిన్న చిన్న పదము లతో సరళముగా సౌమ్యముగా వుంటుంది. ఈ ప్రార్థన యాంత్రికముగా చేయడం గాక అంతరార్థమును తీసుకుని ఆచరించ గలిగితే మన గమ్యాన్ని చేరగలము. పరిపూర్ణమైన శాంతిని పొందగలము.

## విశ్వప్రార్థన

విశ్వం అంటే సర్వవ్యాపకమై జగత్తును సృష్టించి దివ్యశక్తిగా జగత్తులో ప్రవేశించినవాడని అర్థము. పరమాత్మ అని, పరమ పురుషుడు అని, విశ్వము నకు పర్యాయ పదములుగా వేదం చెపుతోంది. ప్రార్థన ద్వారా పరమాత్మను పొందగలిగితే శాశ్వత ఆనందాన్ని పొందగలుగుతాము.ప్రార్థనకు పర్వతము లను కూడ కదిలించే అత్యద్భుతమైన శక్తి కలదు. ప్రార్థనకు ముఖ్యంగా విశ్వాసం వుండాలి. ప్రార్థన సాఫల్యం పొందాలి అంటే **"అన్యదా శరణం, నాస్తి త్వమేవ శరణం మమ"** అన్నభావన ఉండాలి. అంటే భగవంతుడు తప్ప వేరే గతిలేదు అన్నభావనతో, మనస్సును హృదయంతో ఏకమై చేసిన ప్రార్థన సఫలీకృతం అవుతుంది. ప్రార్థన, ద్వారా మనస్సు స్పటికంవలె శుద్ధమవు తుంది. **"దహ్రం విపాపం పరమేశ్మభూతం యత్ పుండరీకం పరమధ్య సంస్థం"** పరమాత్మ పవిత్ర హృదయాలలో మాత్రమే నివశిస్తాడు. ప్రార్థన ద్వారా ఇంద్రియ సంయమనము కలిగి దైవీగుణములను అలవరచు కొని విశ్వంను (పరమాత్మను) పొందుటకు అవ్యాజకరుణతో విశ్వమానవాళి శ్రేయస్సుకై విశ్వప్రార్థనను పూజ్యశ్రీ స్వామి శివానందవారు అందించిరి.

## విశ్వ ప్రార్థన

ఓ ! పూజ్యప్రభూ ! క్షమా పరిపూర్ణ ! ప్రేమమయా
నీకు నమస్కృతులు, సాష్టాంగ ప్రణామములు.
నీవు సచ్చిదానందుడవు, సర్వాంతర్యామివి,
సర్వశక్తిమయుడవు, సర్వజ్ఞుడవు
సర్వజీవ హృదయాంతర్వాసివి.

కరుణార్ద్ర హృదయము, సమదృష్టి, స్థిరమనస్సు, భక్తి, విశ్వాసము, జ్ఞానములను మాకు ప్రసాదింపుము. ఆకర్షణల నణగ ద్రొక్కి, చిత్తవృత్తుల నరికట్టుటకు మాకు వలయు అంతరాధ్యాత్మిక శక్తి నొసంగుము. కామ,క్రోధ,లోభ,ద్వేషముల బారి నుండి మమ్ము తప్పింపుము. మా హృదయ ఫలకములను సద్గుణము లతో నింపివేయుము.

ఈ సర్వనామ రూపములలో నిన్ను తిలకింపనిమ్ము.
ఈ సర్వనామ రూపములలో నిన్ను సేవింపనిమ్ము.
నిన్ను సదా స్మరించుకొననిమ్ము.
నీ లీలలు సదాగానము చేయనిమ్ము.
నీ నామము సదా మా పెదిమలపై నుండనిమ్ము.
నీలో సదా మమ్ము వసింపనిమ్ము.

**-స్వామి శివానంద**

## ఓ పూజ్య ప్రభూ !

ఓ భగవంతుడా ! అందరిచేత పూజింపబడినవాడు రాజ్యములు పరి పాలించేవారిని ప్రభువు అంటాము. ఈ ప్రభువులకి పన్నులు కట్టాలి. ఈ ప్రభువుల దర్శనము కావాలి అంటే సిఫారుసులు అన్నీ కావాలి. కాని విశాల విశ్వానికి ప్రభువయిన ఆ భగవంతునికి ఎవ్వరూ ఏమీ చెల్లించనవసరము లేదు. గాలిని, నీటిని, వెలుగుని, అన్నింటిని ప్రసాదించాడు. ఒక్క పైసా కూడా చెల్లించనవసరములేదు. ఏ పన్ను కట్టనవసరము లేదు. ఆ ప్రభువు దగ్గరికి చేరుకోవాలి అంటే ఏ సిఫారుసు అవసరములేదు. అందుకే భగవంతుని పూజ్య ప్రభూ అన్నారు. ఆ భగవంతుని చేరుకొనుటకు భక్తి అనే అర్హత ఒక్కటే కావలయును.

# క్షమ

క్షమ అంటే సహనము, ఓర్పు. క్షమ అంటే పిరికితనము చేతకాని తనము కాదు. ఎవరు ఎంత అపకారము చేసినను క్షమించగలిగినవాడు భగవంతుడు. శ్రీరామచంద్రునకు పట్టాభిషేకము సిద్ధమయినది. కైక సుమంత్రునిచే శ్రీరామచంద్రుని పిలిపించి అడవులకు ఏగుమని చెప్పినది. తాను కైకను ద్వేషించలేదు. మనసారా అడవులకు ఏగుటకు అంగీకరించెను. లక్ష్మణుడు కైకను దూషించినను వలదని వారించిన క్షమాశాలి, శ్రీరామ చంద్రుడు. జీవులు భగవంతుడు లేడని దూషించినను, ఎన్ని అపరాధములు చేసినను మనలను రక్షిస్తూ వుంటాడు.

ఓ రావణా ! రామునితో మైత్రి చేసుకొనుము. రామునితో మైత్రి చేసికొనుమంటివి గాని ఇంత ద్రోహము చేసిన నన్ను రాముడు క్షమించునా? అని సందేహింపకుము. రాముడు క్షమాశీలి. నీ దోషములను రాముడు దోషములుగా భావింపడు. రాముడు నిన్ను క్షమించును. అని సీతమ్మ ఉపదేశించెను.

మనము కూడా రావణుని వలెనే భగవంతుని యందు అపరాధముల నెన్నింటినో చేయుదుము. ఎన్ని అపరాధములు చేసినను సహనముతో భగ వంతుడు మన అందరిని క్షమించి రక్షిస్తూ ఉంటాడు.

“క్షమగలట్టి యతడు సాధువై శోభించు” ఇతరుల అపరాధములను మనసారా క్షమించడం కన్నా గొప్ప గుణం మరొకటిలేదు. సాధువైన వ్యక్తికి లోకంలో ప్రతిష్ట పెరుగుతుంది. అతని సాంగత్యంలో ఇతరులు బాగుపడతారు. నేరం చేసిన వారి మనస్సుకూడ మారిపోయి తమ్ము క్షమించిన వారి ముందు మోకరిల్లి సాధువులుగా మారుతారు. శత్రువుల్ని మిత్రులుగా మార్చే దివ్యౌ షధం క్షమ (వేమన.)

శత్రువులను ప్రేమించుము. వారి గురించి ప్రార్థన చేయుము అని శ్రీ స్వామి శివానంద వారు వ్రాసారు. వ్రాయడమే కాదు వారి జీవితములో ఆచరించిన మహాపురుషులు. ఒకసారి స్వామీజీవారు సత్సంగము జరుపు చుండగా గోవింద అను వ్యక్తి స్వామీజీ వారిని కొట్టుటకు గొడ్డలి తీసుకుని

వస్తాడట! అచ్చట భక్తులందరు ఆయనను పట్టుకుని పోలీసులకు అప్పజెబుదామని అన్నారు. అప్పుడు స్వామీజీ వారు ఇలా అన్నారు. గూండాలను సరి చేయుటయే నా కర్తవ్యము. మంచివారిని సరిచేయు ఆవశ్యకత ఏమున్నది. రెండవరోజు స్వామీజీ వారు గోవిందుడు ఇంటికి వెళ్ళుటకు టికెట్ కొని ఇచ్చి కొంత ద్రవ్యమిచ్చి పూలమాలవేసి సత్కరించిరి. మహాత్ముల ఎదుట ఎంతటి క్రూరమైన వారయినా సరే సాధువులుగా మారిపోతారు.

ధర్మరాజునకు అన్ని శక్తులు వుండికూడ ఒక ఉన్నతమైన లక్ష్యముపెట్టుకొని వచ్చిన కష్టములనన్ని సహించాడు. మహాత్మాగాంధీజీ కూడ తమ అంతిమ సమయంలో తమ ప్రాణాల్ని తీసిన వారిని కూడ క్షమతో వారిని ఏమి దూషించకుండా హే రామా అని ప్రాణాలు విడిచినారు. హంతకునిలో కూడా రాముని దర్శించారు. ద్రౌపతికి అన్ని శక్తులు వుండి కూడ తన పుత్రులను వధించిన అశ్వత్థామను మనసారా క్షమించగలిగెను. భగవద్భక్తి వున్నప్పుడే క్షమాగుణం అలవడుతుంది. మనలో క్షమాగుణం అలవడినప్పుడే జీవుడు భగవంతుని దగ్గరకు చేరుకోగలడు. మనము ఎన్ని అపరాధములను చేసినప్పటికి మన దోషాలను ఎంచకుండా భగవంతుడు మనల్ని రక్షిస్తూ వుంటాడు. అందుకే భగవంతుడిని క్షమాశీలి అన్నారు.

## పరిపూర్ణుడు

భగవంతుడిని పరిపూర్ణుడు అని అన్నారు. భగవంతుడు సర్వవ్యాపకత్వము కలవాడు. ఆకాశము ఏవిధముగా అంతటా వ్యాపించి ఉన్నదో అదే విధముగా భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. పాలయందు వెన్న కనపడక పోయినను అంతటా వ్యాపించి వున్నది. అదేవిధముగా భగవంతుడు బాహ్యప్రపంచ విషయ రాశి యందు వ్యాపించి యున్నాడు. భగవంతుని కారణముగా సృష్టిపొందిన జీవరాశి అంతయు జన్మము కలవి, మార్పులు చెందునవి, పరిమితులు గలవిగా ఉత్పన్నమైనవి. పరిమితిగల వస్తుసముదాయము స్థూలము సూక్ష్మములగుట వలన కాలదేశ పరిమాణము కలిగి యున్నవి. ఒక వస్తువు ఎల్లప్పుడూ ఒకేవిధముగా నుండదు. కాలాన్నిబట్టి వృద్ధి పొందడము క్షీణించడము జరుగుతుంది. కాని భగవంతుడు (మూడు కాలాల్లో మార్పుచెందనివాడు) కాలాతీతుడు, దేశాతీతుడు, కాలదేశ కారణములకు బద్ధుడు అగుటలేదు.

జన్మము పొందునది ఈ దేహము, బాహ్య ప్రపంచ జీవరాశి. సృష్టికి కారణమగు భగవంతుడు జన్మించుట లేదు. అతడు స్వయంభూః. ఈ అనంత సత్యస్వరూపము గలవాడు క్షీణించడు, గుణాతీతుడు, దేశకాలాలకు అతీతుడు, వస్తు పరిచ్ఛిన్నము కానివాడు. అందుకే భగవంతుడిని పరిపూర్ణుడని అన్నారు.

## ప్రేమమయా

భగవంతుని ప్రేమ స్వరూపుడు అన్నారు. దైవమే ప్రేమ, ప్రేమయే దైవము. ప్రేమ మూడు విధములు. 1. అధమము 2. మధ్యమము 3. ఉత్తమమైనది.

**1. అధమము :** ఈ ప్రేమ పశు-పక్ష్యాదులలో వుంటుంది. వాటి జాతి పక్షులను తప్ప ఇతర పక్షులను చేరనీయవు. అలాగే అందరూ ఏదైనా ప్రయోజనము వుంటేనే ప్రేమిస్తారు. ఇది అధమమైన ప్రేమ.

**2. మధ్యమము :** తన కుటుంబము - తన బంధువులు, స్నేహితులు అంతవరకే అతని ప్రేమ పరిమితమై వుంటుంది.

**3. ఉత్తమము :** ఈ ప్రేమ విశాల ప్రేమ-ఎవ్వరి దగ్గర నుండి ఏమి ఆశించకుండా అందరిని సమానంగా ప్రేమిస్తారు. మహాత్ములందరిలో ఈ విధమైన ప్రేమ వుంటుంది. ఎవ్వరు కోరకుండకనే వారి కష్టములను తనవిగా భావించి ప్రేమతో శాంతింప జేస్తారు.

ఉదా - ఒక నాస్తిక భిక్షగాడు - ఒక గృహస్థు.

ఒక గృహస్థు ఇంటికి ఒక భిక్షగాడు వస్తాడు. గృహస్థు ఆదరించి వానికి తగిన భోజన పదార్థాలు తయారు చేస్తాడు. అన్ని పదార్థాలు వడ్డించిన తరువాత హరేరామ చెప్పమని గృహస్థు భిక్షగానితో చెప్పాడు. ఈ భిక్షగానికి కోపము వచ్చి ఆ దేవుడే వుంటే నన్ను ఎందుకు ఇన్ని కష్టాలు పెడతాడు దేవుని పేరే ఎత్తను అని భగవంతుని దూషిస్తాడు. ఈ గృహస్థునకు కోపము వచ్చి వానికిభోజనము పెట్టకూడదు అని భోజనం పెట్టకుండా పంపించేస్తాడు.

ఆ రాత్రి భగవంతుడు గృహస్థుని స్వప్నములో కనిపించి ఒక్కరోజు నన్ను తలచకపోతే భోజనం పెట్టకుండా పంపించేసావు. ఈ భిక్షగానికి

ఇప్పుడు 84 సం॥ల వయస్సు. ఒక్కరోజు నన్ను తలవకపోయినా ఇన్నాళ్లు భోజనం పెట్టి కాపాడినది ఎవరు ? అని భగవంతుడు ప్రశ్నిస్తాడు. ఈ విధంగా భగవంతుడు మన దగ్గర నుండి ఏమి ఆశించకుండా మనము దూషించినా కూడ అందరిని ఒకేవిధంగా ప్రేమతో చూస్తాడు. తల్లి ఏవిధంగా పిల్లలందర్నీ సమానంగా భేదం లేకుండా చూస్తుందో భగవంతుడు అదే విధంగా అందర్నీ సమానంగా ప్రేమతో చూస్తాడు. అందుకే భగవంతుడిని ప్రేమస్వరూపుడు అన్నారు.

## నీకు నమస్కృతులు

నమస్కారము చేయుట వలన దేవునకు కృప కలుగును. నిజమైన భక్తి శ్రద్ధలతో నమస్కరించిన జనన మరణ రూపమైన భవసాగరము నుండి తరించ వచ్చును.

"నమ ఇతిద్వే అక్షరే" నమ అనునవి రెండు అక్షరములు "మ"అనగా అహంకారము "న"యనగా లేదు నమ అనగా అహంకారము లేదు అని అర్థము. ఇట్లు నమ శబ్దము వలన అహంకారము నశించును. చేయునది నేను కాను, నేను నీచేతిలో కీలుబొమ్మను, నీవెట్లాడించిన నట్లాడుదును. చేయునది అంతయు భగవంతునిదే అని చెప్పుట. కర్త, కర్మ, క్రియలన్నియు నీవేగాని నేనుగాను అని భారము భగవంతునిపై వైచుటకు "నమ" యనిపేరు.

నమస్కారము యొక్క మహత్మ్యము భగవానుడు నారదునితో నిట్లు చెప్పెను. ఓ నారదా ! నా భక్తుడై శ్రద్ధతో గూడుకొన్నవాడై యెవరు నాకు నమస్కారము చేయుదురో వాడు చండాలుడైనప్పటికిని వానికి అక్షయ లోకము ప్రాప్తించును. అక్షయ లోకమంటే క్షయము కాని శాశ్వతమైన అమృతత్వమును పొందెదరు.

ఒంటిచేతి నమస్కారము చేయరాదు. వినయముతో రెండు చేతులతో నమస్కారము చేయవలెను. ఎవరొంటిచేతి నమస్కారము చేయుదురో వారి చేతులను తెగగొట్టవలసినదని శాస్త్రము చెప్పుచున్నది. దేహాభిమానము వదలి నమస్కారము చేయుటచే గోపికలను శ్రీకృష్ణుడు రక్షించెను. విభీషణుడు చేతులు జోడించి శరణు వేడుటచే శ్రీరామచంద్రుడు అతనిని లంకాధిపతిగా పట్టము గట్టెను. భారత యుద్ధమున అశ్వత్థామ వేసిన నారాయణాస్త్రమునకు శ్రీకృష్ణార్జునులు నమస్కరించియే ప్రాణములు కాపాడుకొనిరి. ఛత్రపతి శివాజి

శ్రీ సమర్థ రామదాసులవారికి నమస్కరించుటచేతనే పరమభక్తిని పొందెను. ఈ విధముగా ఎందరో మహాత్ములు వినయముతో భక్తితో నమస్కారము చేసి ముక్తినొందిరి.

## సాష్టాంగ ప్రణామములు

అష్టాంగములతో కూడిన నమస్కారము. చేతులు, కాళ్ళు, రొమ్ము నొసలు, భుజములు, నేల తగులుచు జేతులు మొగ్గవలె జేసి మనోబుద్ధ్యభి మానముతో చేసిన నమస్కారమునకు సాష్టాంగ నమస్కారమందురు. దండము వలె భూమి మీద పడి ఎవరు నమస్కరించుదురో వారు పొందు గతి నూరు యజ్ఞములు చేసినను పొందలేదు.

**"మన్మనాభవ మద్భక్తః-మద్యాజీ మాం నమస్కురు"** (భ.గీ. 18-65)

నా యందు మనస్సు నిలుపుము. నా భక్తుడవగుము లేదా నన్ను పూజింపుము అదియు చేయలేకపోతే నాకు నమస్కరింపుము అని శ్రీకృష్ణుడు చెప్పినాడు. పది అశ్వమేధ యాగములు చేసినవాడు మరల జన్మించును. కాని శ్రీకృష్ణునకు నమస్కారము చేసినవారు మాత్రము భవసాగరము నుండి అమృతత్త్వమును పొందెదరు. సూర్యనారాయణుడు ప్రత్యక్షదైవము. ఆయనకు సాష్టాంగ నమస్కారము చేసినచో సంపూర్ణ ఆరోగ్యమును పొందెదరు. ఆకాశము నుండి పడిన నీరు సముద్రమునెట్లు చేరుచున్నదో అట్లే సర్వదేవత లకు చేసిన నమస్కారము కేశవునకు చెందుచున్నది. గురువునకు భక్తితో నమస్కరించిన, గురువు ప్రసన్నుడగును. ముక్తి మార్గమునకు దారిచూపునది గురునమస్కారమే. తల్లిదండ్రులకు నిత్యము నమస్కరింపవలయును. తల్లి కంటె గొప్పదైవము లేదు. "అహం బ్రహ్మాస్మి" అను సన్యాసియైనప్పటికిని మాతృవందనము చేయవలయును. సద్గురువులను చేరి నమస్కరించి వారి అనుగ్రహము పొంది జ్ఞానామృతము పొందవలెను. సర్వము వాసుదేవ మయ మని నమస్కరించ వచ్చును.

శ్రీ శివానంద స్వామీజీవారు ఇలా అనేవారు, కుక్కకు పందికి కూడ మానసికముగా నేను నమస్కరింతును. ఈ భావము దృఢము చేసుకొనుటకు ప్రతీప్రాణికి నమస్కరించవలయును. ఎవరికి నమస్కరించినా ఆ భగవంతు నికే నమస్కరిస్తున్నామని భావన వుండవలెను. నమస్కారము యొక్క అంత

రార్థము– మనము భగవంతునికి గాని గురువుకి గాని నమస్కరించినప్పుడు పవిత్రభావనతో నమస్కరిస్తాము. అనుక్షణము ఆ భావము కలిగి వుండాలని సాష్టాంగ నమస్కారము యొక్క అంతరార్థము. శ్రీరామకృష్ణ పరమహంస వారికి నమస్కారము చేయుటచే శ్రీ వివేకానందుడు బ్రహ్మజ్ఞానము పొందెను. శ్రీ భీష్మపితామహులవారు శ్రీకృష్ణునికి నమస్కరించి ధన్యత పొందిరి. నమస్కా రము వలన అక్రూరుడు శ్రీకృష్ణానుగ్రహము పొంది విశ్వరూపమును సంద ర్శించెను.

## నీవు సచ్చిదానందుడవు

### సత్ - సత్య స్వరూపుడు

సచ్చిదానందుడవు సత్–చిత్–ఆనందస్వరూపుడవు. సత్యమను శబ్దము పరమాత్మను తెలియుజేయునది. భూత, భవిష్యత్, వర్తమాన కాలములలో (మూడు కాలములలో) మార్పుచెందనివాడు, అందుచే భగవంతుని సత్ అని అన్నారు.

### చిత్-జ్ఞాన స్వరూపుడు

మానవునకు ఒక విషయములో వున్న జ్ఞానము ఇంకొక విషయములో వుండదు. మానవుని జ్ఞానము పరిమితమైనది. న్యూటను భూమికి ఆకర్షణ శక్తి వున్నదని పరిశోధనచేసి కనుగొనెను. ఆ కనుగొనే జ్ఞానాన్ని ఇచ్చినది ఎవరు? అన్ని జ్ఞానాలకు ఆధారము, బుద్ధిని నడిపించే చైతన్యమే ఆయన. అది వస్తువుయొక్క జ్ఞానము కాదు. కేవల శుద్ధజ్ఞాన స్వరూపము. ఉపాధు లచే పరిమితత్వము నొందనిది. సర్వజగన్నిర్మాణము సంకల్పమాత్రముచే చేయగల జ్ఞానము కలవాడు. సర్వజగత్ సృష్టికి ఆవశ్యమగుజ్ఞానము కలవాడు భగవంతుడు. ఆ జ్ఞానము సంపాదించుకొనినది కాదు. సహజము అని **"స్వాభావికీజ్ఞాన బలక్రియాచ"** అని ఉపనిషత్తు చెప్పుచున్నది. అందుకే భగవం తుని జ్ఞానస్వరూపుడు అన్నారు.

### ఆనంద -స్వరూపుడు

మన ఆనందము విషయ వస్తువులు అనుభవించినప్పుడు వుంటుంది. ఈ విషయ వస్తువుల ఆనందము క్షణికము. మనం ఆనందాన్ని మూడు రకాలుగా అనుభవిస్తుంటాము. 1. ప్రియం 2. మోదం 3. ప్రమోదం.

**1. ప్రియం :** మనకు ప్రియమైన వస్తువుని తలచుకొనినప్పుడు వచ్చే ఆనందం ప్రియం అంటారు.

**2. మోదం :** మనకు ప్రియమైన వస్తువు మనకు దగ్గరగా వస్తే ఆ ఆనందం ఇంకొంచెం ఎక్కువవుతుంది. ఈ విధంగా ఎక్కువయిన ఆనందమే మోదం అంటారు.

**3. ప్రమోదం :** ప్రియమైన వస్తువును మనము అనుభవించే సమయములో సహజంగా మన ఆనందం అత్యున్నత స్థాయికి చేరుకుంటుంది. ఈ ఆనందాన్ని ప్రమోదం అంటారు.

ఈ ఆనందములన్ని మేఘముల వలె క్షణకాలము వుండి పోయేవి. వస్తువులనుబట్టి మారిపోతాయి. కావున భగవంతుడొక్కడే ఆనందస్వరూపుడు. నిజమైన ఆనందం ఆ భగవంతునికే వుంటుంది. భగవంతుని స్వభావమే ఆనంద ఘనం. పరిపూర్ణమైన ఆనంద స్వరూపుడు, సృష్టికర్త యగు బ్రహ్మ కూడ ఈ అపార ఆనందరాశిలో తృణమాత్రము అనుభవింప గలుగుచున్నాడు. కావున భగవంతుడు ఒక్కడే ఆనందస్వరూపుడు. ఆయన ఆనందం అఖండమైనది, పరిపూర్ణమైనది. అందువలన భగవంతుని ఆనంద స్వరూపుడు అన్నారు.

## సర్వాంతర్యామీ

భగవంతుడు సర్వత్రా ఉన్నాడు. ఆయనలేని చోటు లేదు. హిరణ్యకశిపుడు నీ శ్రీహరి ఎక్కడ అని ప్రహ్లాదుని అడిగెను. ప్రహ్లాదుడు ఈ విధముగా చెప్పెను.

**ఇందుగలడందు లేడని**
**సందేహము వలదు చక్రి**
**సర్వోపగతుండెందెందు**
**వెదకి చూచిన నందందే గలడు**
**దాన వాగ్రణి వింటే** – (పోతనభాగవతం 7స్కం.ప 275)

ఏడిరా నీ హరి ఈ స్థంభము నందుగలడా అని ప్రహ్లాదుని ప్రశ్నించెను. ఔను తండ్రి ఈ స్థంభము నందు కూడ కలదు. హిరణ్యకశిపుడు గదతో

స్థంభమును కొట్టగా నరసింహ అవతారమెత్తి భగవంతుడు సర్వత్రా ఉన్నాడని నిరూపించెను. అణువు మొదలు బ్రహ్మాండము వరకు ఆ భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. నామరూపములు కలదానినిగా ప్రకృతిని మార్చి అందు జీవులలో చేరియుండి ప్రవేశించును.

"అన్తర్ బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణస్థితః" అని ఉపనిషత్తులో చెప్పబడినది. లోపల, బయట, పైన, క్రింద ప్రతిచోట ఆ నారాయణుడు వ్యాపించి వున్నాడు.

## సర్వశక్తిమయుడు

మన అందరిలో వుండే చైతన్యము ఆయనే ఆ భగవంతుని చైతన్యము మనలో ఉంటేనే కళ్లు చూస్తాయి, చెవులు వింటాయి. ఆ భగవంతుని చైతన్యము లేని యెడల ఈ శరీరము మాంసపు ముద్ద వంటిది. మన రెండు కళ్లు తీసి బల్లమీద పెట్టి చూడమంటే చూస్తాయా? చూడవు. ఆ భగ వంతుని శక్తి వలనే ఈ కండ్లు చూస్తాయి. నోరు మాట్లాడుతుంది. సూత్రధారి వుంటేనే తోలుబొమ్మ ఆడుతుంది. అదే విధంగా ఈ జీవుడు ఆ చైతన్యం వున్నంతసేపు తోలుబొమ్మలాగ ఆడుతాడు. ఆయన చైతన్యము వుంటేనే ఈ శరీరానికి విలువ. చెప్పులకైనావిలువ ఉందిగాని ఈ చైతన్యము లేని శరీరానికి విలువలేదు. ఈ జగత్తు నంతటిని పాలించేశక్తి భగవంతుని ఒక్కనికే గలదు.

## సర్వజ్ఞుడు

**"యః సర్వజ్ఞః సర్వవిత్"** (ముం.ఉ 1-1-8)

భగవంతుడు సర్వమును సమిష్టిగను, వ్యష్టిగను కూడ ఎరిగిన వాడని ఉపనిషత్తు చెప్పుచున్నది. భగవంతునికి సర్వము తెలియును. ఎవ్వరికి ఎంత ఇవ్వవలెనో ఏ సమయములో ఏది ఇవ్వవలెనో ఆయనకి తెలుసును.

ఉదా - ఒక బాటసారి వెళ్తూ దారిలో ఒక మర్రిచెట్టు క్రింద కూర్చుని ఇట్లు ఆలోచించెను. ఆ భగవంతునికి ఏమి తెలియదు ఇంతపెద్ద మర్రి వృక్షమునకు ఇంతచిన్న పళ్లు సృష్టించెను. నేలమీద ప్రాకే చిన్న గుమ్మడి పాదునకు పెద్ద గుమ్మడికాయలను సృష్టించెను. ఈ భగవంతునకు ఏ పథకము తెలియదు. అదే నేనే అయివుంటే ఈ పెద్ద మర్రి వృక్షమునకు పెద్ద

గుమ్మడికాయలను, చిన్న గుమ్మడిపాదునకు చిన్న మర్రి పళ్లు సృష్టించి వుందును. నేనే సూత్రకారుడుని, ఆ భగవంతునికి ఏది ఎలా సృష్టించాలో తెలియదు. అని ఆలోచిస్తూ ఆ వటవృక్షము క్రిందనే నిద్రించెను. తాను సుఖంగా నిద్రించి, నిద్రలేచిన పిమ్మట తన శరీరమంతా చూచెను. శరీర మంతా మర్రిపళ్లు రాలివున్నవి. అప్పుడు ఆ బాటసారి ఈ విధంగా ఆలోచిం చెను. అయ్యో నా తెలివి తక్కువవల్ల భగవంతుని దూషించాను. ఈ మర్రిచెట్టునకు పెద్ద గుమ్మడికాయలు సృష్టించి ఉంటె ఈ సమయానికి నా పని గోవింద అయ్యేది. ఆ భగవంతునికే దేనిని ఏవిధంగా సృష్టిచెయ్యాలన్నది తెలుసును. అందుకే భగవంతుడిని సర్వజ్ఞుడు అన్నారు.

## సర్వజీవ హృదయాంతర్వాసివి

ప్రతి ప్రాణిలో భగవంతుడు ఉన్నాడు. పిండాండము మొదలు బ్రహ్మాం డము వరకు భగవంతుడున్నాడు. ఎవరిని హింసించినా భగవంతుని హింసించినట్లే. ఒక భక్తుడు ఒకసారి భగవంతుని తన ఇంటికి విందుకి రమ్మని ఆహ్వానించెను. భగవంతుడు సరే అనెను. భక్తుడు రకరకముల మిఠాయిలను చేసి భగవంతుని రాకకై ఎదురు చూచుచుండెను. ఒక కుక్క భక్తుని ఇంటికి వచ్చెను. భక్తుడు కుక్కను తరిమి బాగా దెబ్బలు కొట్టెను. భగవంతుడు ఎప్పటికి రాలేదు. ఎదురు చూసి చూసి భక్తుడు నిద్రించెను. రాత్రి కలలో భగవంతుడు దర్శనమిచ్చెను. భక్తుడు ఓ దేవా ! ఎందుకు రాలేదు అని ప్రశ్నించెను. అప్పుడు భగవంతుడు తన వీపును చూపించెను. నేను కుక్క రూపములో నీ ఇంటికి వచ్చితిని చూడుము నీవు కొట్టిన దెబ్బలు. అప్పుడు ఆ భక్తుడు పశ్చాత్తాపము పొంది క్షమించమని ప్రార్థించెను. భగవం తుడు ప్రతి ప్రాణిలో ఉన్నాడు. ఎవ్వరిని దూషించినా, హింసించినా భగవంతుని హింసించినట్లే.

## కరుణార్ద్ర హృదయము

**"దయగల హృదయమే భగవన్నిలయము"**

ఎవరి హృదయము దయతోనిండి వుండునో అచ్చటనే భగవంతుడు వసించును. తనకన్న తక్కువ వారియందున, ఎవరైనా కష్టసమయములో ఉన్నప్పుడు వారు కోరకుండగనే వారి కష్టమును తనదిగా భావించి వారికి

తగిన సహాయము దయగలవారు చేయుదురు. దయగలవారు ఎవరికైనను ఆపదలు కలిగినచో ఆపదలు కలిగినవారి కంటె వారే ఎక్కువగా దుఃఖించె దరు. ప్రతి ప్రాణియందు తారతమ్యము లేక దయ చూపవలెను.

రంతిదేవునివద్ద యాదృచ్ఛికముగా తనకు లభించిన ధనము మాత్రమే గలదు. పైగా, ఆయన తనకు లభించిన దానిని వెంటనే దానము చేసెడి వారు. దానితో ఆయనవద్ద ధనము ఏమిలేకుండుట వలన, ఆయన మాత్రమే కాకుండా ఆయన కుటుంబ సభ్యులు కూడ క్లేశమును పొందినను ఆయన ధైర్యము కోల్పోలేదు. త్రాగేందుకు నీవు కూడ దొరకక 40 రోజులు గడిపెను. ఒకనాడు ఉదయం ఆయనకు నేయి, పాయసం, హల్వా, నీరు లభించెను. వారు ఆ ఆహారంను తినగోరునంతలో, ఒక బ్రాహ్మణుడు, శూద్రుడు, కుక్కలతో చండాలుడు అతిధులుగా వచ్చి ఆ ఆహారమును పూర్తి చేసిరి. చివరిగా మిగిలివున్న నీటిని స్వీకరించు సమయమున ఒక కసాయివచ్చి దాహంగా వున్నదని తీసుకొనెను. ఇంతటి దయనీయ స్థితిలో కూడ రంతిదేవుడు తన నియమము వీడలేదు. దయార్ద్ర హృదయుడై భగవంతుని ఇలా ప్రార్థించెను. **“నాకు అష్టైశ్వర్యములు, మోక్షముగాని వద్దు. సకలప్రాణుల హృదయములలో వుండి వారి దుఃఖమును నేను అనుభవించి, వారికి దుఃఖము తొలగునట్లు అనుగ్రహింపుము.”**

## సమదృష్టి

భగవంతుడు అందరిని సమానంగా చూస్తాడు. సూర్యుడు భవనము నందుగాని, పూరి ఇల్లు యందుగాని, పెంటకుప్పయందు గాని ఏవిధమైన బేధం చూపకుండా ఒకే విధముగా వెలుగుని అందిస్తాడు. వర్షము కూడ ఏ బేధము చూపకుండా అంతటా సమానంగా పడుతుంది.

శ్రీరామచంద్రుడు సూర్యవంశమునకు చెందిన క్షత్రియుడు. వశిష్ఠుని శిష్యుడు. చక్రవర్తి కుమారుడు. అట్టి శ్రీరామచంద్రుడు పల్లెవాడయిన గుహుడు, జటాయువు, బోయస్త్రీ శబరి, వానరుడయిన సుగ్రీవుడుని తనతో సమానముగ భావించిప్రేమించెను. వారందరు జాతి చేతగాని, విద్య యందు గాని, ఐశ్వర్యము నందుగాని సమానులు కారు. కాని రాముడు అల్పమైన పక్షియందు కూడ సమభావము చూపెను.

**విద్యా వినయసంపన్నే - బ్రాహ్మణే గవిహస్తిని ।**
**శునిచైవశ్వపాకేచ - పణ్డితాః సమదర్శినః ॥** (భ.గీ. 5-18)

విద్యా వినయములతో కూడిన బ్రాహ్మణుని యందును, గోవు నందును, ఏనుగును, కుక్కను, కుక్క మాంసం తినే వానియందును కూడ మహాత్ములు ఒకే విధంగా సమదృష్టితో చూస్తారు. ఇచ్చట పండితులు అంటే M.A.Ph.D డిగ్రీలు పొందినవారే పండితులుకారు.

"చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి" అని ప్రహ్లాదుడు చెప్పిన రీతిగ చీమలో బ్రహ్మలో సర్వత్ర పరమాత్మను చూచినవాడే పండితుడు. గోపికలు చెట్టులో పుట్టలో అంతటా శ్రీకృష్ణుని దర్శించారు. ఆకాశంలో విమానయానం చేసేవాడికి భూమిపైన వుండే హెచ్చు తగ్గులు కనపడవు. కొండలు, మిట్టలు అన్ని సమానంగా కన్పిస్తాయి. అదే విధంగా మహాత్ములు నామరూపాలు, ఉపాధులు వేరైనా అంతటా భగవంతుని చూస్తారు.

**సమదృష్టి ఎలా వృద్ధి అవుతుంది అంటే -**

అందరియందు సమభావము, సద్భావము వున్నప్పుడు మనస్సు పవిత్ర మగును. దక్షప్రజాపతి యజ్ఞము చేయునప్పుడు సమభావము నుంచలేదు. అందువలన దుఃఖము అనుభవించవలసి వచ్చినది. అతనికి యజ్ఞము వలన కల్యాణము కలుగలేదు. ఎందుకనగా అతనికి శివునియందు సమభావము లేకుండెను. దాని వలన యజ్ఞకార్యములో కష్టము సంభవించినది. కనుక ఎవ్వరియందును సంకుచిత భావము వుండకూడదు. దక్షునకు పరమేశ్వరుని యందు సంకుచిత భావముండుటచే పతనమయ్యెను.

ఇదే విధముగా ఇతరుల యందు సమభావము, సద్భావము లేనప్పుడు పతనమవుతాము. ఎవరియితే అందరిలో సద్భావము కలిగి వుందురో, నాలో వున్న భగవంతుడే అందరిలోను వున్నాడు, అనే భావనతో అందరిలో భగవంతుని దర్శిస్తాడో అట్టి వానికి అందరియెడ సమదృష్టి అలవడుతుంది. భగవద్భక్తి వున్నప్పుడే సమదృష్టి కల్గుతుంది. సమదృష్టి అలవర్చుకొనుటకు అందరిలో భగవంతుని చూచుటయే మార్గము. కబీరు కుక్కయందు కూడ భగవంతుని దర్శించెను. సమదృష్టి అలవడినప్పుడు మనస్సు పవిత్రమయి భగవంతునికి దగ్గరవుతాము.

## స్థిరమనస్సు

అసంగము, శుద్ధము అయిన చైతన్యమే జీవుని నిజస్వరూపం. కాని శరీరం, ఇంద్రియాలు, ప్రాణాలు అనే తాళ్లతో మనస్సు జీవుని బంధిస్తోంది. తన దివ్య స్వరూపాన్ని తెలుసుకోవడానికి ముందు మనస్సును నియమించాలి. అందుకే మన మహర్షులు మనస్సునే అవిద్య అన్నారు. కాబట్టి ముక్తిని కోరేవారు మనస్సుని ప్రయత్నించి పవిత్రం చేసుకోవాలి. (శంకరులు.)

**"చిత్తై చలతి సంసారః, నిశ్చలే మోక్షః ఉచ్యతే"**

ఈ చిన్న శ్లోకములో సర్వ ఉపనిషత్తుల సారమున్నది. సంసారమంటే భర్త, భార్య, పిల్లలు అనుకుంటాము. కాని అది కాదు. మనస్సు చలించుటయే సంసారము. మనస్సు చలించని యెడల సంసారములో వున్నను అది సంసారము కాదు. నిశ్చలమైన మనస్సే మోక్షాన్ని ప్రసాదిస్తుంది. ఎంతటి జ్ఞానులైనా ఎందుచేత పతనమవుతారో శ్రీ శంకరులు వివరిస్తారు.

**లక్ష్య చ్యుతం చే ద్యది చిత్తమేషద్,**
**బహిర్ముఖం సన్నిపతేత్తత స్తతః ।**
**ప్రమాదతః ప్రచ్యుతకేలికందుకః,**
**సోపానపంక్తౌ పతితో యథాతథా ॥** (వి.చూ.శ్లో. 325)

చేతినుండి పొరపాటుగా జారిపడిన బంతి మెట్లమీద నుండి కిందకు దొర్లిపోయినట్లుగా పొరపాటుగా మనస్సు ఒక క్షణమయినా బహిర్ముఖమయితే మనస్సు మాయలో పడిపోతుంది. ప్రయత్నపూర్వకంగా మనస్సుని అంతర్ముఖం చెయ్యకపోతే, స్వభావతః అది బాహ్యంగా చూస్తూనే ఉంటుంది. మనలక్ష్యం మీది దృష్టి ఏ మాత్రము చెదిరినా మనస్సు ఇంద్రియ భోగవస్తువుల మీదకు పోతుంది. ఒక్కమారు మనస్సు పతనమైనచో బంధంలో చిక్కుకుంటుంది. ఈ భావాన్ని చక్కగా అర్థం కావడానికి బంతి ఉదాహరణను ఇచ్చారు. మనస్సుని బంతితో పోల్చిరి. ఈ మనస్సు కోతిలాంటిది. మనస్సును స్థిరముచేయుట గొప్ప సమస్య. మహావీరుడైన అర్జునుడికి కూడ ఈ సందేహం వస్తుంది.

**"చంచలం హి మనః కృష్ణ ! ప్రమాథి బలవద్ధృఢం"** (భ.గీ.6-34)

భగవంతుడు ఇలా అంటాడు.

**"అభ్యాసేన తు కౌంతేయ, వైరాగ్యేణ చ గృహ్యతే"** (భ.గీ. 6-35)

కుంతి కుమారా, అభ్యాసం చేతను వైరాగ్యం చేతను మనస్సు లొంగుతుంది. విషయ వస్తువుల వల్ల నష్టమేగాని సుఖంలేదని గ్రహించినప్పుడు మనస్సు విముఖమై మళ్ళిపోవడమే వైరాగ్యం. ప్రపంచములో వస్తువులకు, వాటి ఆకర్షణలకు లోబడకపోవడమే వైరాగ్యం. మనస్సు బైటికి వెళ్లినప్పుడల్లా అరికట్టుతూ వుంటే అది క్రమంగా అభ్యాసమవుతుంది. అభ్యాసము వైరాగ్యము ద్వారా మనస్సును స్వాధీనపరచ వచ్చును.

**"మనః ఏవ మనుష్యాణాం, కారణం బంధమోక్షయోః"**

కావున మనస్సే బంధానికి, మోక్షానికి కారణం. మనస్సు రజస్తమోగుణముల వలన పరిమితమయినప్పుడు బంధానికి కారణమవుతుంది. సత్త్వగుణమున్నప్పుడు, ముక్తికి కారణమవుతుంది. రజస్తమో గుణములను విడవాలి. అంటే మనలో మన అజ్ఞాన ఆవరణను తొలగించాలి. మనస్సు "ఓం" వైపు అంతర్ ముఖమయినప్పుడు సత్వగుణంతో నిండి ఉంటుంది. ఈ మనస్సును ఇంత కష్టపడి ఎందుకు నిగ్రహించాలి ? అనే సందేహం వస్తుంది సాధకునికి.

బాహ్య దృష్టి నుండి మనస్సు మరలించినప్పుడు మనస్సు శాంతంగా ఉంటుంది. శాంతించిన మనస్సులో పరమాత్మ ప్రకాశిస్తుంది. అందులో నిష్టమ సాధిస్తే భవబంధాలు నశిస్తాయి. కాబట్టి ముక్తిని కోరేవారు తీసుకోవలసిన మొదటి జాగ్రత్త మనస్సు యొక్క బహిర్ దృష్టిని నిరోధించి పరమాత్మ వైపు అంతర్ ముఖము చేయడమే. మనస్సును జయించినవాడు సర్వమును జయించును. పట్టుదల, శ్రద్ధ వుండి అభ్యాసం చేస్తే ఎవరయినా మనస్సును స్వాధీనపరచుకొనుట సాధ్యమే.

## భక్తి

కర్మయోగ, జ్ఞానమార్గముల కంటె భక్తిమార్గము చాల సుగమమైనది, శ్రేష్టమైనది. భగవంతుని యందు గల ప్రేమను భక్తి అంటారు. గృహము మీద, దారాపుత్రుల యందు గల ప్రేమను భగవంతునిపై పెట్టిన ముక్తినొసగును.

**" హృషీకేశ హృషీకేశ, సేవనం భక్తిరుచ్యతే "**

ఇంద్రియములతో హృషీకేశుని సేవించుటయే భక్తి అంటారు. ఇంద్రియములకు వశముగాక మనసును లోబరచుకుని భగవంతుని సేవించవలెను.

"స్వస్వరూపానుసంధానం" (శంకరులు) తన స్వరూపాన్ని అనుసంధానము చేయుటయే భక్తి అని అంటారు. శ్రీ శంకరాచార్యుల దృష్టిలో భక్తి అంటే భిక్షగానివలె భగవంతుని యెదుట యాచించడము కాదు. అసంపూర్ణము, పరిమితుల నుండి తన స్వరూపాన్ని గుర్తిస్తూ పరిపూర్ణత కోసం ప్రయత్నించే ప్రతీ ప్రయత్నం భక్తిగా చెప్పబడుతుంది.

ఏదోయొక ఇష్టదైవమును ఎంచుకుని ఆ దేవుని మీద ప్రేమ నుంచవలయును. అంతా పరబ్రహ్మమేయని ఇతర దైవములను ద్వేషింపరాదు. రాముడు శివుని పూజించెను. శివుడు రాముని పూజించెను. అన్నింటిలో ఉన్నది ఒక్కడే దేవుడు. ఇతర దైవములను ద్వేషించిన వారి గతి ఏమవుతుందో నారాయణుడు చెప్తున్నాడు.

**శ్లో॥ మద్భక్తోశంకర ద్వేషీ – మద్వేషీ శంకరప్రియః ।**
**తావు భౌనరకం యాతః – యావచ్చంద్ర దివాకరౌ ॥** (విష్ణు.పు.)

నా భక్తుడై శంకరుని ద్వేషించినవాడును, నన్ను ద్వేషించి శంకరుని ప్రియమైన వాడును వీరిద్దరును సూర్యచంద్రులున్నంత వరకు నరకము అనుభవింతురు. అంతరార్థము – ఇచ్చట నరకము అంటే ఎచ్చటనో కాదు ఇచ్చటనే అనుభవించవలసి ఉంటుంది. శివుడు గొప్ప, విష్ణువు గొప్ప అని ద్వేషించుకుని కలహములు కల్గినప్పుడు అశాంతి కల్గును. అశాంతి కల్గిన వానికి సుఖమెక్కడ అదియే నరకము.

**చతర్విధాభజంతే మాం – జనాస్సుకృతినోర్జున ।**
**ఆర్తోజిజ్ఞాసురర్థార్థీ – జ్ఞానీ చ భరతర్షభ ॥** (భ.గీ 7–16)

కష్టాలలో వున్నప్పుడు భగవంతుని ప్రార్థించేవాడు – ఆర్తుడు, భగవంతుని తెలుసుకోవాలని కోరిక వున్నవాడు – జిజ్ఞాసువు, విషయవాంఛ వున్నవాడు – అర్థార్థి. భగవంతుని స్వరూపం తెలిసినవాడు – జ్ఞాని.

ప్రహ్లాదుడు దీనితోపాటు నవవిధ భక్తుల వలన ముక్తి పొందవచ్చునని చెప్పెను.

**శ్రవణం, కీర్తనం విష్ణోః - స్మరణం పాద సేవనం ।**
**అర్చనం, వందనం, దాస్యం - సఖ్యమాత్మనివేదనం॥** -భాగవతం

## 1. భగవంతుని లీలలు శ్రవణ చేయుట

మహాత్ములైన ఋషులందరు భగవత్ సంబంధమైన జ్ఞానమును పర మాత్మ వలన శ్రణము చేసిరి. వారు వినుటచేతనే దానికి శ్రుతియని పేరు వచ్చినది. శబ్దబ్రహ్మమును గ్రహించుటయే శ్రవణము. శ్రవణము చేయు శబ్దమంతయు ఓంకారము నుండి వచ్చినది. “ఓం తద్బ్రహ్మ” యని శ్రుతులు చెప్పుచున్నవి. కావున శ్రవణము చేయునది అంతయు పరమాత్మయే. శ్రవ ణము చేసిన సర్వ సందేహములు తీరును. శ్రవణముచే శ్రేయోమార్గమేదియో, ప్రేయో మార్గమేదియో తెలియును. భగవంతుని కథలు శ్రవణము చేయు నప్పుడు మనస్సు దివ్యభావముచే పవిత్రమగును. సత్పురుషుల ద్వారా వినిన ఇంకయు మేలు కలదు. మూఢులను, జ్ఞానమూర్తులుగా చేయునది శ్రవణమే. గ్రంథపఠనము కూడ శ్రవణభక్తిలో చేరును. భగవంతుని పవిత్రచరిత్రను, గుణమహిమలు వినవలయును. ఇదియే శ్రవణము.

శ్రీహరి చరిత్రయును శ్రద్ధాభక్తులతో వినినను లేక చదివినను వానికి సంసార బంధము నుండి ముక్తి కలుగును. నారదుడు మొదటి జన్మములో దాసిపుత్రుడై ఉన్నప్పటికి ఋషులకు సేవ చేయుచుండగా వారి వలన భగవత్ కథలు వినగా నారదునికి కలిగిన అనుభవమును ఈ విధముగా చెప్పినాడు.

**“వారల్‌కృష్ణ చరిత్రల్పదువగా-వర్ణింపగా బాడగా**
**నారంబు సుధారస ప్రతిమయై-యశ్రాంతమున్ వీనులం**
**దోరంబై పరిపూర్ణమైన మది-సంతోషించి నేనంతటన్**
**బ్రారంభించితి విష్ణుసేవ - కితర ప్రారంభదూరుండనై”**

(పోతన భాగవతం1స్కం)

శ్రీకృష్ణ చరిత్రము అమృతము వలె గమ్మనై వీనులకు విందుగా నున్నదట. భక్తి కలిగిన వారందరు దాని రుచి గ్రహింపగలుగుదురు.

**స్త్రీ, ధని, నాస్తిక, వైరి చరిత్రం న శ్రవణీయమ్॥**
(నా.భ.సూ. అ6-సూ63)

స్త్రీలయొక్కయు, ధనికుల యొక్కయు, వేదశాస్త్రములు నమ్మనివారి యొక్కయు, విరోధుల కథలను వినరాదని నారదుల వారు చెప్పిరి.

స్త్రీల చరిత్రలలో గార్గి, సులభ, మైత్రేయి, చూడుల, మదాలస చరిత్రలు వినవలెను. శ్రవణము చేసినప్పుడు పూర్తిగా మనసును భగవంతునివైపు త్రిప్పవలెను.

ఉదా–ముకుంద మాలను రచించిన పరమ భక్తాగ్రేసరుడైన యాళ్వారు లలో జేర్పబడిన కులశేఖరాళ్వారుయను రాజు రామాయణము వినుచు రామునితో రాక్షసులు యుద్ధము చేయుచున్నారని పురాణము చెప్పు పండితుని వలన విని సేనాధిపతికి సేనను సాగించవలసినదని యాజ్ఞాపించెను. సేనతో తాను యుద్ధమునకు పోవుచుండ మంత్రి మొదలగు వారెంత చెప్పినను వినలేదు. రాముని పక్షము నుండి తాను రాక్షసులతో పోరాడవలెనని ఆయన యుద్దేశ్యము. భక్తిభావముచే శ్రవణ మహిమచే దేశకాలాదులను మరచెను. తెలివిగల మంత్రియొక వార్తాహరునిచే శ్రీరాముడు గెలిచినాడనియు రాక్షసు లందరును జచ్చినారనియు కబురు పంపెను. వెంటనే ఆ రాజు నమ్మి సేనతో నింటికి మరలెను. శ్రవణ మహిమ ఈ విధముగా నుండును. సద్విషయ శ్రవణము జేసిన వైరాగ్యము, భక్తి, జ్ఞానములు కలుగును. మహర్షుల ద్వారా శ్రవణము చేయుట చాలా ఉత్తమమైనది. శ్రవణము వలన భగవంతుని యందు విశ్వాసము కల్గును. ప్రపంచ విషయములందు ఆశక్తి తొలగును. మనస్సు పవిత్రమగును. ప్రపంచ విషయములందు ఆ శక్తి తొలగును. మనస్సు పవిత్రమగును. చివరకు ముక్తి నొందును. శుకమహర్షి ద్వారా భాగవతము శ్రవణము చేయుటచే పరీక్షిన్మహారాజు భవసాగరము నుండి ముక్తి నొందెను.

## 2. భగవంతుని లీలలు కీర్తన చేయుట

భగవల్లీలను గానమొనర్చుటయే కీర్తన. ఈ కలియుగములో కీర్తనయే ఉత్తమమైన యోగము. శరీరము, వాక్కు, మనస్సుతో భగవంతుని కీర్తించ వలెను.

**నదేశ నియస్తత్ర – న కాల నియమస్తథా ।**
**చక్రాయుధస్య నామాని – సదా సర్వత్ర కీర్తయేత్ ॥**

దేశ నియమముగాని, కాల నియమముగాని లేదు. చక్రాయుధుడైన విష్ణు నామముల నెల్లప్పుడు నే దేశములోనైనను కీర్తించవచ్చును. నామదేవ్, సోపానదేవ్, మీరా, రామదాసు, త్యాగరాజు మొదలగు మహాత్ములందరు నామ సంకీర్తనము చేసి పూర్ణత్వము పొందిరి. సంకీర్తనము వలన కలుగు లాభము.

**"నమే భక్త చతుర్వేది – మద్భక్తోశ్వప చ ప్రియః"**

నా యందు భక్తి లేక నాలుగు వేదములు చదివినను ప్రయోజనము లేదు. నా భక్తుడే ప్రియుడు.

వేదములు అధ్యయనము చేయుట చాల కష్టమైన పని. సంకీర్తనకి వేదమునకు బేధము లేదు. వేదముల సారమే సంకీర్తనము. శబ్దమే సంకీర్తనము. వేదములు సంకీర్తన నుండియే ఉద్భవించినవి. వైఖరి, మధ్యమ, పశ్యంతి పరాయని శబ్దములు నాలుగు విధములు. వైఖరి నాలుక నుండి యుద్భవించుచున్నది. మధ్యమ గొంతు నుండి ఉద్భవించుచున్నది. పశ్యంతి హృదయమున కలుగుచున్నది. పరా నాభి నుండి ఉద్భవించుచున్నది. ప్రతి శబ్దములో నొక దివ్యమైన శక్తి కలదు. అందులో భగవన్నామములో నింక యెక్కువ శక్తి గలదు. సంకీర్తనము వలన భావ సమాధి కలుగును. సంకీర్తనము ఆధ్యాత్మిక, ఆధి దైవిక, ఆధి భౌతిక తాపములను అణుచును. అజ్ఞాన ఆవరణను తొలగించును. రజస్తమోగుణములు నశించును. సత్త్వగుణము ఏర్పడును. సత్త్వగుణముచే శాంతి చేకూరును. కొన్ని రాగముల వలన ప్రకృతి కూడ వశమై యుండును. మేఘరంజని రాగము వలన ప్రకృతి కూడ వశమై యుండును. మేఘరంజని రాగము వలన మేఘములు ఏర్పడును. అగ్ని దీపక రాగము వలన జ్యోతులను వెలిగించవచ్చును. తాన్‌సేన్ అక్బరు కొలువులో దీపములు వెలిగించెను. ప్రతీ రాగమునకు అనేక శక్తులు గలవు. కబీరు తుకారాం, తులసీదాసు ఎందరో మహాత్ములు సంకీర్తనము వలన ముక్తులైరి.

## 3. భగవంతుని నామము స్మరించుట

భగవంతుని లీలలను విని కీర్తించిన తరువాత సర్వకాల సర్వావస్థల యందు భగవంతుని జ్ఞప్తియందుంచుకొనుటయే స్మరణ యనబడును. భగవంతుని నామరూపములను స్మృతియందుంచుకొనుటయే స్మరణ.

**మయ్యే వ మన ఆధత్స్వ - మయి బుద్ధిం నివేశయ।**

**నివసిష్యసి మయ్యేవ - అత ఊర్ధ్వం న సంశయః॥** (భ.గీ. 12-8)

ఓ అర్జునా ! ఎవరు మనస్సును, బుద్ధిని, నిరంతరము నా యందే నిలిపి స్మరించుచుందురో అట్టి భక్తుడు సులభముగా నన్నే పొందును. ఇందు సందేహం లేదు. ద్వేషముచే అయినను కంసుడు ముక్తినొందెను. అనుక్షణము దేనిని స్మరిస్తామో దాని రూపమే పొందుతాము. “యద్భావం తద్భవతి” భ్రమర కీటక న్యాయంలో కీటకం చివరికి భ్రమరంగా మారుతుంది.

## భగవంతుని స్మరణము మూడు విధములు

1. నామ స్మరణము 2. రూప స్మరణము 3. స్వరూప స్మరణము.

**1. నామ స్మరణము :** “నామ స్మరణాదన్యోపాయం - నహి పశ్యామో భవతరణే”

భవసాగరము నుండి తరించుటకు నామస్మరణ కంటే వేరొక ఉపాయము లేదు. కృష్ణ, రామ, శివ, దుర్గ ఏ నామమైనను వారి ఇష్టప్రకారం సర్వకాల సర్వావస్థలందు స్మరించవలెను.

**2. రూప స్మరణము :** ఎల్లప్పుడు భగవంతుని రూపము స్మరించుట వలన ప్రారంభదశలో స్వప్నాదులందు భగవంతుడు దర్శనమిచ్చును. భావ సమాధి కల్గును. వారి తీవ్రతను బట్టి బాహ్యముగ కూడ దర్శనమిచ్చును. శ్రీ నారాయణ తీర్థులముందు శ్రీకృష్ణుడు నృత్యము చేసెను. శ్రీనివాసుడు బాలాజీ దగ్గరకు వచ్చి పాచికలు ఆడెను. తులసీదాసుచే గంధము పూయించు కొనెను. శ్రీరామకృష్ణ పరమహంస వారికి కాళిమాత పూలనుకోసి ఇచ్చెడిది. రూప స్మరణము వలన ఆనందము కల్గును. రూప స్మరణం వలన భగవత్ దర్శనము కలుగును.

**3. స్వరూప స్మరణము :** నేను దేహమును కాను, శాశ్వతుడును, వికార రహితుడను, సచ్చిదానంద స్వరూపుడను. యెల్లప్పుడు ఒకే విధముగా ఉండువాడునని తన నిజ స్వరూపమును భావించవలెను. దేహాభిమానమును విడువవలెను. స్వరూప స్మరణ చేయుటచేత దేహాభిమానము తగ్గును. ఆత్మ సాక్షాత్కారము కల్గును. ప్రపంచమంతయు మిధ్యగా తోచును. శాశ్వతమైన

ఆనందము లభించును. ప్రహ్లాదుడు స్మరణచేత ముక్తి నొందెను. నిరంతర నామస్మరణము వలన తులసీదాసు, చైతన్య మహాప్రభువు ముక్తి నొందిరి. రూప స్మరణము వలన నారాయణ తీర్థులవారు, త్యాగరాజాదులు ముక్తి నొందిరి.

**"అంతకాలే చ మామేవ-స్మర న్ముక్త్వా కళేబరమ్"** (భ.గీ. 8-5)

గాంధీమహాత్ముడు మరణ సమయములో కూడ "హేరామ్" అని తుది శ్వాసను విడిచెను. హంతకునిలో కూడ గాంధీ శ్రీరాముని దర్శించెను. అంత్యకాలమున స్మరించిన అని చెప్పారు కదా! ఉద్యోగ విరమణ అయిన తరువాత మూడవకాలు (ఊతకర్ర) వచ్చిన తరువాత భగవంతుని స్మరించ వచ్చును అని కొందరనుకుంటారు. ఇచ్చట అంత్యకాలములో కూడా అంటే ఎల్లప్పుడూ స్మరిస్తూ చివరి సమయములో కూడా స్మరించవలెనని భగవంతుడు చెప్పెను.

## 4. పాద సేవనము

భగవంతుని పాదములను సేవించుటయే పాదసేవన మందురు. భరతుడు శ్రీరామపాదుకలను సేవించి ధన్యుడయ్యెను. అహల్య జీవితము శ్రీరామచంద్రుని పాదధూళి సోకిన తర్వాత ధన్యమయ్యెను. భగవంతుని పాదములు ప్రత్యక్షముగా మనకు దొరకవు. బ్రహ్మ నిష్ఠులైన గురువులయొక్క పాదములను సేవించుటయే పాదసేవనము. భగవంతుని దగ్గరకు చేర్చేవాడు గురువు కాబట్టి గురువు పాదములను సేవించవలెను.

**అభివాదన శీలస్య - నిత్యం వృద్ధోపసేవనః ।**

**చత్వారి తస్య వర్ధంతే ఆయు ర్విద్యా యశోబలమ్ ॥** (మనుస్మృతి)

గురువునకు నమస్కరించుచు, నిత్యము పెద్దలకు సేవ చేయు స్వభావము గలవానికి ఆయుస్సు, విద్య, కీర్తి, బలము కల్గును.

**గుకారశ్చ గుణాతీతః-రుకారో రూపవర్జితః ।**

**గుణాతీత మరూపం చ - యోదద్యాత్స గురుస్మృతః॥** (గురుగీతశ్లో91)

"గు" కారము వలన గుణాతీతుడనియు "రు" కారము వలన రూపము లేనివాడనియు తెలియును. గుణాతీతము రూపాతీతమైన తత్త్వమేది గలదో

అదియే గురువు. పరమాత్మతత్త్వమే గురుతత్త్వము. గురువును తలచినంతనే సమస్త పాపములు తొలగుచున్నవి. భక్తితో పాదసేవనము చేసిన నెంతయో ఫలము గలదు.

**"యస్యదేవే పరాభక్తిః - యధాదేవే తధా గురౌ"**

ఎట్టి పరమభక్తి దైవము నందు గలదో అట్టి భక్తి గురువునందు నుంచ వలెను.

**యోవిష్ణోః ప్రతిమాకారే - లోహబుద్ధిం కరోతి చ ।**
**యో గురౌ మానుషం భావ - యుభౌ నరకపాలినౌ ॥**

విగ్రహాకారుడైన విష్ణువును లోహమనియు గురువుని మానవుడని ఎవరు తలంతురో వారిద్దరును నరకమును అనుభవింతురు. ఇచ్చట నరకమంటే ఎచ్చటనో కాదు, ప్రతిమ నందు భగవంతుని భావము లేకపోతే విశ్వాసము వుండదు. విశ్వాసము లేకపోతే భక్తి కుదరదు. గురువును మానవుడని తలచితే గురువు చెప్పిన వాక్యములందు శ్రద్ధ వుండదు. శ్రద్ధలేని వాడు ఆయన చెప్పిన వాక్యములను గ్రహించలేడు. భగవంతుని యందు విశ్వాసము లేక గురువాక్యములను ఆచరించని యెడల శాంతి ఎక్కడ! శాంతి లేని యెడల ముక్తి ఎక్కడ. ఇదియే నరకము. గురుపాదసేవనము వలన గుర్వనుగ్రహము గల్గును. గుర్వనుగ్రహము వలన భక్తి, జ్ఞానము కల్గును. గుర్వనుగ్రహము వలననే మంత్రసిద్ధి కల్గును. భగవంతుని పాదసేవనము వలన పృథుమహా రాజు, రాముని పాదసేవనము వలన భరతుడును ముక్తి నొందిరి. గురువు పాదసేవనము వలన ఏకలవ్యుడును ధన్యత నొందెను.

## 5. భగవంతుని అర్చించుట

భగవంతుని ఆరాధనయే అర్చన మనబడును. ఆరాధన అంటే భగవం తుని పూజించటమే. భగవంతుని నర్చిపక మనము భుజింపరాదు. ప్రతి గృహమును దేవాలయముగా మార్చుకొనవలెను. వ్యాసులవారి మతమున దేవపూజానురాగమే భక్తి.

**"పూజాదిష్వనురాగ ఇతిపారాశర్యః"** (నా.భ.సూ. అ1-సూ16)

ఎవరైతే భగవంతుని నర్చించునో వాడు శాశ్వతమైన ఆనందమును పొందును.

**శ్లో॥ గృహం శ్మశానం తవబింబవర్జితం**
**కథావిహీనాశ్చ గిరశ్శివారుతమ్ ।**
**శ్వపుచ్ఛవద్ దాస్య వినాకృతం వపుః**
**వదంతి హి త్వయ్య నివేదితం విషమ్ ॥** (భాగవతము)

స్వామీ నీ బింబము (పటము లేక మూర్తి) లేని యిల్లు శ్మశానము. నీ కథలు లేని మాటలు నక్కకూతలు. నీ సేవ చేయని దేహము కుక్కతోక వంటిది. నీకు నివేదింపని భోజనము విషమని మహాత్ములు చెప్పుదురు.

విషమైనను భగవంతునికి నివేదించినప్పుడు అమృతమగును. మీరా బాయి తనకిచ్చిన విషమును కృష్ణునకు అర్పించి తాను త్రాగెను. విషమే అమృతముగా మారెను. భగవంతుని ఆరాధనము లేని గ్రామమందు, భగ వంతుని ఆరాధనలేని గృహమునందు భోజనము చేయరాదు. నీరైనను త్రాగ రాదు. ఒక క్షణమైన నచట నిలువరాదు.

**భగవద్గీతా కించ దధీతా, గంగాజల లవకణికాపీతా ।**
**సకృదపియేన మురారిసమర్చా, క్రియతే తస్య యమే న చర్చా ॥**
(భ.గో.స్తో. 20)

ఎవరు భగవద్గీతను కొంచమయినా చదువుతారో, గంగాజలాన్ని కొంచమైనా సేవిస్తారో, శ్రీకృష్ణుని కొంచెమయినా పూజ చేస్తారో వారికి యముని బాధలు ఉండవు. మురారి అర్చనం – ముర అంటే అహం, ఈ అహం భగవంతుని ప్రార్థన వల్ల మాత్రమే పోతుంది. ఈ అహంకారాన్ని నాశం చేయకలిగేది మురారి అర్చన ఒక్కటే. గీతాధ్యయనం, గంగాజలపానం, మురారి అర్చనం ఈ మూడు చేసిన వానికి యమబాధ ఉండదు.

**యో యో యాం యాం తనుం భక్తః,**
**శ్రద్ధయాఽర్పితు మిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధామ్,**
**తామేవ విదధామ్యహమ్ ॥** (భ.గీ. 7–21)

ఎవడెవడు ఏ రూపాన్ని శ్రద్ధతో ఆరాధించాలని కోరుతాడో, ఆయా భక్తునికి అందులోనే భక్తిని, శ్రద్ధని నేను కలిగిస్తాను.

మనకు సర్వాన్ని భగవంతుడే ఇచ్చాడు. ఆయన ఇచ్చిన వస్తువులను భగవంతునికి అర్పింపక భుజించినవాడు దొంగయని భగవద్వాక్యము. "మోక్షమునపేక్షించువాడు హరిని పూజింపవలయును" (భాగవతము) ఎవరైతే నిర్మలమైన మనస్సుతో షోడశోపచారముల భగవంతుని ఆరాధించి గంధ పుష్ప, ధూప, దీపనైవేద్యం సమర్పించి పూజ చేయుదురో వారు శ్రీహరిని చేరుదురు. కొందరు రాముని పూజించెదరు. కొందరు లక్ష్మీనారా యణుల పూజింతురు, కొందరు గణపతిని, కుమారస్వామిని పూజింతురు. శాక్తేయులు శక్తిని పూజింతురు. కొందరు కృష్ణుని, కాళిని పూజింతురు. ఇష్టదైవ మొక్కరుగానే యుండవలయును. ఒకనికి శివుడు ఇష్టదైవమైన రాముని దర్శించునపుడు తన శివుడే రాముని రూపమున వున్నాడని తలచ వలెను. ఎవరిని పూజించినను యితర దేవతలను ద్వేషింపరాదు. ఎవరిని పూజించి నను ఆయనయే పరబ్రహ్మమనియు, ఆయనయే సృష్టి, స్థితి, లయ కారకు డనియు తెలియవలెను. భగవంతుని పూజించుటకు ధనమక్కరలేదు.

**పత్రం పుష్పం ఫలం తోయం, యో మే భక్త్యా ప్రయచ్ఛతి**

**తదహం భక్త్యుపహృతం, అశ్నామి ప్రయతాత్మనః॥** (భ.గీ. 9-26)

భక్తితో ఆకునో, పుష్పమునో, ఫలాన్ని, నీటినిగాని నాకు ఎవరు సమర్పి స్తారో అది స్వీకరిస్తాను. ముఖ్యముగా భగవంతునికి కావలసినది భక్తుని శుద్ధమైన హృదయం.

గజరాజు - భక్తితో పుష్పమును సమర్పించెను.

రుక్మిణీ అమ్మవారు-భక్తితో తులసీపత్రమును సమర్పించెను.

శబరి - భక్తితో రామునకు ఎంగిలి పండ్లను సమర్పించెను.

భక్తకన్నప్ప - భక్తితో శ్రీకాళహస్తిలోని లింగమునకు ఎంగిలి నీటితో అభిషేకము చేసెను.

భగవంతుని అర్చించే అసలైన పుష్పాలు ఏమిటి అంటే

**శ్లో॥ అహింసా ప్రథమం పుష్పం, పుష్పమింద్రియ నిగ్రహః ।**
**సర్వభూత దయాపుష్పం - క్షమాపుష్పం విశిష్యతే ॥**

**శ్లో॥ శమః పుష్పం, తపః పుష్పం-ధ్యానపుష్పం తద్దైవచ ।**
**సత్యం చైవాష్టమం పుష్పం-ఏతై స్తుష్యతి కేశవః॥** (విష్ణుపురాణం)

అహింస, ఇంద్రియ నిగ్రహము, సర్వభూతదయ, ఓర్పు, శమము, తపము, ధ్యానము, సత్యము ఈ ఎనిమిది పుష్పములు భగవంతునికి ప్రీతికర మైనవి. భగవంతుని అర్చన వలన బ్రహ్మానందము కల్గును. భవసాగరము నుండి తరించవచ్చును. శ్రీరామకృష్ణపరమహంస కాళీమాతను అర్చించి ముక్తి పొందెను. శ్రీ త్యాగరాజు రాములవారిని అర్చించి ముక్తి పొందెను. ఈ విధముగా ఎందరో మహాత్ములు వారి యిష్టదైవమును అర్చించి ముక్తినొందిరి.

## 6. వందన భక్తి

వందనమనగా నమస్కరించుట. వందనము ముఖ్యముగా గురువునకు, తల్లిదండ్రులకును, భగవంతునకును, సత్పురుషులకును, మహాత్ములకును చేయవలెను. ఇది చాల సులభమైనది. ఎటువంటి క్రోధ స్వభావులైనను వందనము వలన వశమగుదురు.

గురువునకు నమస్కరించవలెను. గురువునకు నమస్కరించి ఆయన కృపను పొందుటచే సర్వసందేహములు తొలగి భక్తి జ్ఞానములు కలుగును. కాని వందనము శారీరకముగానే కాదు మనస్సుతో కూడ చేయవలెను.

మాతాపితరులకు, వృద్ధులకు, నమస్కరించవలెను. తల్లిదండ్రులు ముక్తి పొందుటకు శరీరము నిచ్చినారు. "మాతృ దేవోభవ, పితృదేవోభవ" అని ఉపనిషత్తులు చెప్పుచున్నవి. మాతా పితృల సేవ చేయువానిని చూచి సర్వ దేవతలు నమస్కరింతురు. తల్లిదండ్రుల సేవ చేయనివాడు ఎన్ని ధర్మకార్య ములు చేసినను బూడిదలో పోసిన పన్నీరు యగును.

**"న మాతుః పరదైవతమ్ ॥**

"తల్లికంటె గొప్పదైవము లేదు." సన్యాసి అయినప్పటికిని తల్లికి నమస్కా రము చేయవలెను. ధర్మవ్యాధుడు మాతాపితరుల సేవచేసి ధన్యత పొందెను.

శ్రీకృష్ణుడు పిలువకుండనే గోపికల యిండ్లకు పోయి వెన్న తినుచుం డెను. కాని అతడు మనయింటికి ఎందుకు రావడము లేదని ఎప్పుడయినా మనము ఆలోచించినామా ? మనము కూడ "శ్రీకృష్ణుడు" మన యింటికి తనంతట తాను వచ్చు సత్కర్మను జేయుదమని నిశ్చయించుకొనవలెను. శ్రీకృష్ణుని ముందు చేతులు జోడించుట, శిరమును వంచుట వానికి అర్థ మేమి? చేతులు క్రియాశక్తికి ప్రతీకము. చేతులు జోడించుట కర్థమేమనగా "నేనీ చేతులతో సత్కర్మను చేయుదునని," శిరము వంచుట కర్థమేమనగా "నేను నా బుద్ధిని, శక్తిని హే కృష్ణా ! నీకర్పించుచున్నా"నని తన క్రియాశక్తిని, బుద్ధిశక్తిని శ్రీకృష్ణునకు అర్పించవలెను. భగవంతునికి నమస్కరించి నందు వలన పాప తాపములు నశించును. మహాభారత యుద్ధములో శ్రీకృష్ణుడు వదలిన చక్రమునకు భీష్మపితామహులవారు నమస్కరించియే ధన్యత పొం దెను. చైతన్యునకు నమస్కరించుట చేతనే జగన్నాధ మాధవులు రక్షింపబడిరి. నమస్కారము వలన నలకూబర, మణిగ్రీవాదులు ముక్తిపొందిరి. ఈ విధంగా ఎందరో మహాత్ములు వందన భక్తిచే అమృతత్త్వమును పొందిరి.

## 7. దాస్యభక్తి

దాస్యభావము ద్వారా భగవంతుని సేవించుటయే దాస్యభక్తి అందురు. స్వామి కార్యములను జాగ్రత్తగా చేయువాడు దాసుడని అర్థము. దాసునకు భయము, భక్తి, విశ్వాసము వుండవలెను.

**"దాసోహం వాసుదేవస్య, దేవదేవస్య శాఙ్గిన్ణః ।**

**శంఖచక్ర గదాపాణేః – త్రైలోక్యస్యైక చక్షుషః ॥**

దేవతలందరికిని దేవుడును, శాఙ్గన్, శంఖ, చక్రగదా పాణియు, త్రిలోక ములకు అధిపతి అయిన వాసుదేవునకు నమస్కారము.

అని నిరంతరము అనుసంధానము చేయవలెను. తాను మహాత్ముడనని అనుకొనువాడు, జ్ఞానిని అనుకొన్నవాడు ఎన్నటికిని దాస్యభావము పొంద లేడు. భక్తి విశ్వాసములతో దాసుడై సేవచేయవలెను.

సీతాదేవి ఆంజనేయుని నీవెవరు అని యడిగినప్పుడు "దాసోహం కోసలేంద్రస్య" యని చెప్పెను. ఆంజనేయుడు నవవ్యాకరణ పండితుడు.

నాలుగు వేదములు అధ్యయనము చేసినవాడు అయినప్పటికి సీతమ్మ వారి దగ్గర తన పాండిత్యము ప్రదర్శించలేదు. ఆంజనేయుడు లంకా గమనము చేయునప్పుడు దారిలో ఎన్నికష్టములు వచ్చినను ఎదిరించి ధైర్యముతో తన లక్ష్యమును వీడక ముందుకుసాగెను. అనుక్షణము తాను దాసుడనను భావమున నుండవలెను. తాను అధికుడనని, పండితుడనని భావము వుండరాదు. వినయముతో దాస్యము చేయవలెను.

సుగ్రీవుడు రావణునితో అంటాడు.

**"లోకనాథస్య రామస్య – సమాదాసోస్మి రావణః"**

ఓ రావణా ! జగన్నాథుడైన రామునకు దాసుడను. అందరూ నారాయణ స్వరూపులే ! అందుచే ఎవ్వరికి సేవచేసినను భగవంతునికి దాస్యము చేసినట్లు భావించవలెను.

**శ్లో॥ నాన్యంవదామి, నశృణోమి, న చింతయామి ।**
**నాన్యం స్మరామి, న భజామి, న చాశ్రయామి ॥**

**శ్లో॥ భక్త్యాత్వదీయ చరణాంబుద మంతరేణ ।**
**శ్రీనివాస ! పురుషోత్తమ దేహి దాస్యమ్ ॥**

అన్యమైనది పలుకను, వినను, చింతించను, అన్యమైనవి స్మరించను, భజించను అన్యులను ఆశ్రయించను. మీ చరణారవిందములనే ఆశ్రయించితిని. కావున ఓ శ్రీనివాసా, పురుషోత్తమా! నీ దాస్యము దయచేసి ఒసగుము. అని భగవంతుని ప్రార్థించవలెను. గురు శుశ్రూష భగవంతుని సేవతో సమానము. గురువు ప్రత్యక్ష దైవము. శబరి గురుశుశ్రూష చేసి రాముని పొందెను. దాస్యభక్తి వలన ముక్తి నిస్సందేహము. దాస్యభక్తి వలన శ్రీలక్ష్మణుడు, భరతుడు, శబరి, వానరులందరును, హనుమంతుడును తరించిరి.

## 8. సఖ్య భక్తి

భగవంతునితో స్నేహభావమును పెంపొందించుకొనుటయే సఖ్యభక్తి అందురు. భగవంతుని లక్షణములు గల సజ్జనులతో సాంగత్యము చేయుట, భగవంతునితో స్నేహము చేయుట వంటిది. భగవద్భక్తుల సాంగత్యము

దుర్లభము. వారి దర్శనము వల్లను, సంభాషణము వలన శాశ్వతమైన అమృతమైన పదవి లభించును.

**"తస్మిన్ స్తజ్జనే భేదా భావాత్"** (నా.భ.సూ అ3-సూ41)

భగవంతునకును, భగవంతుని భక్తులకును బేధభావములేదు.

**"మహత్సంగస్తు దుర్లభః అమోఘః అగమ్యశ్చః॥** (నా.భ.సూ3-సూ39)

మహాత్ములతో సంగము దుర్లభము, అమోఘము,అగమ్యము.

**"లభ్యతేపి తత్కృపయైవ"** (నా.భ.సూ అ3 - సూ.40)

భగవంతుని దయవలనే సత్సంగము లభించును. సత్సంగమునకు మించినది లేదు.

**"త్రిజగతి సజ్జన సంగతి రేకా, భవతి భవార్ణవ తరణే నౌక"** (భ.గో.స్తో.13)

స్వర్గ, మర్త్య, పాతాళలోకాలలో కూడ భవసాగరాన్ని దాటడానికి "సజ్జన సంగతి" ఒక్కటియే ఉపాయమైన పడవ, ఈ జనన మరణము నుండి దాటడానికి సజ్జన సాంగత్యం అవసరం. సజ్జనులు అంటే అన్నీ తెలిసినవారు ఆత్మ నిగ్రహము కలవారు. భగవంతుని విషయంలో సద్బోధ చేయగలిగిన వారు, ఆచరణలో పెట్టగలిగినవారు. ఈ సజ్జన సాంగత్యం మనసు ఎక్కడో పెట్టుకుని సాంగత్యం చేసిన మాత్రాన ఉపయోగం లేదు. సరియైన విధంగా మనసుతో సాంగత్యం చేస్తే ఉపయోగం ఉంటుంది. ఈ మనస్సు పరిపరి విధములుగా ఇంద్రియ విషయముల పట్ల పోతూ వుంటుంది. దీని నుండి మనసును మళ్ళించడానికి సజ్జన సాంగత్యము ఒక్కటియే మార్గము.

**సాధు సాంగత్యం చేయడం వల్ల వచ్చే ప్రయోజనం-**

**సాధుసాంగత్య మమరిన శాంతమమరు**
**శాంత మమరిన చిత్తంబు శక్యపడును**
**శక్యపడిన మనంబెయోసంగు బరము**
**పరము గాంచిన శివుడన బరగు వేమ**

సాధుపురుషులతో సాంగత్యం చేయడం మూలంగా శాంతం వస్తుంది. శాంతమైన చిత్తానికి అలజడులు తగ్గి సమర్థత పెరుగుతుంది. స్థిరమైన

మనస్సు పరాన్ని చూపుతుంది. పరాన్ని చూచినవాడు శివుడవుతాడు. సాంగత్యము అంటే శారీరకమైన సన్నిహిత్యంకాదు. మానసికమైనది. సాధువులు చెప్పిన వాక్యములను అర్థముచేసుకుని ఆచరణలో పెట్టగలిగిన ప్పుడే మన మనస్సు కూడ ప్రశాంతతని పొందుతుంది. సజ్జన సాంగత్యము వలన క్రమేపి మనలోవున్న దుర్గుణములు నశించును. ఇంద్రియభోగ విషయములందు ఆసక్తి తగ్గును. మనస్సు భగవంతుని యందు స్థిరపడును.

**సత్సం గత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం ।**
**నిర్మోహత్వే నిశ్చలతత్వం, నిశ్చలతత్వే జీవన్ముక్తిః॥** (భ.గో.స్తో. 9)

మంచివాళ్ళ సాంగత్యం ద్వారా నిస్సంగము అలవాటవుతుంది. అసంగ త్వము వల్ల మోహనాశము అవుతుంది. మోహనాశనము వలన నిశ్చలతత్త్వ మేర్పడి దాని వలన జీవన్ముక్తి కలుగును. దుర్జన సాంగత్యము చేయరాదు. వారితో స్నేహము చేసిన వారి గుణములు వీరికి క్రమముగా వచ్చును.

శ్రీకృష్ణునితో సఖ్యమొనర్చి కుచేలుడు ముక్తి నొందెను. అర్జునుడు కూడ శ్రీకృష్ణునితో సఖ్యమొనర్చి ముక్తినొందెను. సుగ్రీవుడు రామునితో సఖ్యము చేసి ఆత్మ సామ్రాజ్యమును పొందెను. శ్రీరామకృష్ణ పరమహంసతో నరేంద్రుడు సాంగత్యం చేయటం మూలంగా నరేంద్రుని మనస్సు మారి వివేకానందగా (మహాత్మునిగా) మారెను. ఇంకా ఎందరో మహాత్ములు సజ్జన సాంగత్యము వలన ముక్తిని పొందిరి.

## 9. ఆత్మనివేదనభక్తి

పూర్ణశరణాగతియే ఆత్మనివేదన అందురు. ఈ భక్తిలో నేను నాది అనే భావము ఉండదు. భక్తుడు తన దేహమును, మనస్సును, బుద్ధిని సర్వ మును భగవంతునికి అర్పించును.

"ఈశ్వరప్రణిదానము"(ఆత్మనివేదనము) ముఖ్యమని చెప్పిరి పతంజలి మహర్షివారు. మనోవాక్కాయముల సర్వభారము భగవంతునిపై నుంచవలెను.

విభీషణుడు శ్రీరాముని శరణువేడినపుడు సుగ్రీవుడు, ఆంజనేయుడు సంశయించిరి. అప్పుడు శ్రీరామచంద్రుడు ఈ విధముగా పలికెను.

**సకృదేవ ప్రసన్నాయ-తవాస్మీతి చయాచితే ।**

**అభయం సర్వభూతేభ్యః దదామ్యేతద్ వ్రతం మమ॥** -వా.రామాయణం

ఒక్కమారైనను నన్ను శరణువేడిన సర్వభూతముల భయము నుండి రక్షించెదను. ఇది నా వ్రతము.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**

**అహం త్వా సర్వపాపేభ్యః మోక్షయిష్యామి మాశుచః॥**

(భ.గీ. 18-66)

సర్వధర్మాలని పరిత్యజించి నన్ను శరణుపొందు. అన్ని పాపాల నుండి నీకు నేను మోక్షమిస్తాను అని శ్రీభగవానుడు హామి ఇచ్చెను.

భక్తిమార్గము మార్జాల కిషోర న్యాయము వంటింది. పిల్లి తన పిల్లలను యేడుచోట్ల త్రిప్పును. తన పదునైన కోరలపై నిడుకొని యెంత మాత్రము హాని కలుగనీయక అతి జాగ్రత్తగా తీసుకు వెళ్లును. ఇచ్చట పిల్లపట్టు లేదు. తల్లి పట్టు మాత్రమే. ఇదే విధముగా భక్తుని భారము కూడ భగవంతునిదే. ఆత్మ నివేదన (పూర్ణశరణాగతి) చేసి ముక్తినొందినవారు జనాబాయి, బలి చక్రవర్తి, కుంతియును.

భక్తుడైనవాడు తనకితరులపకారము చేసినప్పటికి ఇతరులను ద్వేషింపడు. ఒక్కొక్కప్పుడు భగవంతుడు భక్తునకు చాలా కష్టములు పెట్టుచుండును. అట్లు చేయుట భక్తుని కష్టపెట్టవలయును అని కాదు. బాగుచేయవలయునని పరీక్ష పెట్టును. జనాబాయిని దొంగయని ఆరోపణ చేసి ఉరికంబమునకు ఎక్కించిరి. జనాబాయి పాండురంగని పూర్ణ శరణాగతిని పొందెను. ఉరిత్రాడు పూలమాలగా మారెను. ఎటువంటి కష్టమైనను భక్తుని మనస్సు చలించకుండా వుండవలెను. గజేంద్రుడును తన భారమును భగవంతునిపై విడిచెను.

"భక్తి" అంటే స్వస్వరూపానుసంధానం అని శ్రీ శంకరాచార్యుల వారు చెప్పారు. తన స్వస్వరూపాన్ని అనుసంధానం చేయాలి అంటే ఈ "నవవిధ భక్తులలో" కనీసం ఏ ఒక్క భక్తి అయిన నిర్మలమైన మనస్సుతో చేయగలిగితే మనలో వున్న దైవత్వాన్ని గుర్తించ గలుగుతాము. జ్ఞాన మార్గాన నడచి గమ్యం చేరుకోవాలనే సాధకులకు భక్తికి మించిన సాధనము మరేదియు లేదు.

"శ్రీకృష్ణా నాకు స్వర్గముగాని, భూలోకముగాని, నరకముగాని, ఎచ్చట యినను వాసమగుగాక ! అందేదియు నాకపేక్షయయుగాదు. కాని నీ దివ్య పాదపద్మములను మరణకాలమందు మరువక ధ్యానించునట్లు మాత్రము అనుగ్రహింపమని" కులశేఖరులు వేడుకొనెను. (ముకుందమాల) ఇటువంటి భక్తి ప్రసాదించుమని భగవంతుని వేడుకొనవలెను.

## విశ్వాసము

భగవంతునియందు విశ్వాసము ఉంచవలెను. విశ్వాసము లేకపోతే బాహ్య విషయములందైనను విజయము చేకూరదు. ఔరంగజేబునకు ఎవరి యందును విశ్వాసము ఉండెడిది కాదు. అందువలన విశాలమైన మొగలు సామ్రాజ్యము పతనమయ్యెను. యజమానికి నౌకరుయందును, రోగికి వైద్యుని యందును ఆయన యిచ్చిన ఔషధము నందును విశ్వాసము ఉంటేనే రోగము నయమవుతుంది. బాహ్యవిషయములందే విశ్వాసము అవసరమైనప్పుడు భగవంతుని యందు విశ్వాసము లేనప్పుడు వారి గతి యేమిటి ?

**అజ్ఞాశ్చాశ్రద్ధ దానశ్చ సంశయాత్మా వినశ్యతి ।**
**నాయం లోకోఽస్తి న పరో, న సుఖం సంశయాత్మనః॥** (భ.గీ. 4-40)

అజ్ఞాని, శ్రద్ధలేనివాడు, సంశయించినవాడు, నశించిపోతాడు. సంశ యంలో పడినవానికి ఈ లోకంలోగాని, పరలోకంలో గాని సుఖం ఉండదు.

గురువునందు భగవంతుని యందు విశ్వాసము ఉంటేనే సాధనచేసి భగవంతుని అందుకో గలడు. విశ్వాసం లేక సంశయించిన వానికి నాశనం తప్పదు. ఈ లోకంలో మన జీవితం కూడ విశ్వాసం పైన ఆధారపడి ఉం టుంది. దేనిలోను విశ్వాసంలేనివారికి జీవితము నరకము. అతడు ఏ సుఖాన్ని పొందలేడు. ఇక పరమాత్మను ఎట్లు పొందగలడు.

విశ్వాసము లేక ఎన్ని జపములు చేసినను సువాసనలేని పుష్పము వలె, నీరులేని కొలనువలె వుండును. విశ్వాసముతో భగవంతుని కొలిచిన యెడల భగవంతుడు అనుగ్రహించును. దీనికి ఉదా॥ ఉపమణ్యుడను బాలుడు నిరుపేద కుటుంబమున జన్మించెను. ఆ బాలునకు తినుటకు తిండియే లేదు. వానికి పాలు, రసగుల్లాలు ఎచ్చటనుండి లభించును? ఇట్లుండ ఆ

చిన్నవాడు ఒకనాడు తన బంధువుల ఇంటికి పోగా అచ్చట వారు ఈ చిన్న వానికి పాలునిచ్చిరి. పాలరుచి మరిగిన ఉపమన్యుడు తన తల్లి దగ్గరకు వచ్చి అమ్మా ! నాకు మన బంధువుల ఇంటిలో పాల నిచ్చిరి. అట్టిపాలు కావలెను అని మారాము చేసెను. వాని ఏడ్పునకు బాధపడిన తల్లి నీవడిగిన పాలు ఎట్లు లభించును? నా కన్నా ! నీ ఈ చిన్న కోరిక తీర్చలేని నా జన్మ మెందుకు ? నిరుపేద కుటుంబమున పుట్టితివి గదా ! ఏమి చేయుదును? నీవు ఇంత మారాము చేయవద్దు. ఇచ్చినది తినవలెనని ఆ తల్లి బుజ్జగించెను.

అయినను ఆ చిన్నవాడు పాలుకావలెనని పట్టుదల పట్టెను. బిగ్గరగా ఏడువసాగెను. తల్లి చేయునది లేక బాధపడెను. కుమారుని దగ్గరకు తీసి ఇట్లు చెప్పెను. "నా కన్నా ! ఒకటి చెప్పెదను వినుము. నీవు శివుని గూర్చి తపమాచరింపుము. నీకు ఒక గ్లాసు పాలే కాదు. ఆ క్షీరసాగరమే తరలి రాగలదు. ఇందుసంశయములేదు. నీవు శివుని ఆరాధించి సంతోషపెట్టుము." తల్లిమాటలు శ్రద్ధగా విన్న ఉపమన్యుడు తల్లికి నమస్కరించి శివుని గూర్చి తపమాచరించెను. ఆ చిన్నవాని తపమునకు శివుడు మెచ్చి ఉపమన్యుని యెదుట దర్శనమిచ్చి నీ కోరిక ప్రకారము క్షీరసముద్రమే నీ దగ్గరకు రాగలదు అని అనుగ్రహించటయే గాక పార్వతీదేవి ఒడిలో ఉపమన్యుని కూర్చొనబెట్టి సకల సౌభాగ్యములను నిచ్చెను. వయసున చిన్నబాలుడైనను దృఢమైన విశ్వాసము వుండుటచే ఉపమన్యుడు ధన్యుడయ్యెను.

ఒక గొల్లభామ పండితుడు ఉపదేశించిన మంత్రమునందు విశ్వాసముచే నీటిమీద నడిచెను. అదే మంత్రము నందు పండితుడు విశ్వాసము లేక నీట మునిగెను. పండితుడు అయినప్పటికి విశ్వాసము లేనివాడు నశించును. ధృవుడు, ఏకలవ్యుడు విశ్వాసముతో తమ లక్ష్యాన్ని చేరుకున్నారు. శాస్త్రము లందు, భగవంతుని యందు విశ్వాసము గలవాడు భగవంతుని చేరుకో గలడు.

విశ్వాసము నాలుగు విధములుగా నుండవలెను.

1. భగవంతుడు ఉన్నాడని విశ్వసించవలెను. సృష్టి, స్థితి, లయకారకు డనియు, ఆయన లేక ఈ జగత్తు నిలువజాలదని విశ్వాసము నుండవలెను.

2. భగవంతుడు ఒక్కడే ముక్తి ఇవ్వగలడని విశ్వాసము ఉండవలెను.

3. భగవంతుడు ఒక్కడే కరుణాసాగరుడని దీనదయాళుడని విశ్వసించవలెను.

4. **అనన్యాశ్చింతయంతోమాం, యేజనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమం వహామ్యహమ్॥** (భ.గీ9-22)

ఇతర చింతనలులేక నన్నే చింతించుచుతూ ఏ జనులు నన్ను పరిపూర్ణంగా ఉపాసిస్తారో నిత్యముక్తులైన వారి యోగక్షేమాల్ని నేనే వహిస్తాను.

భగవంతుడే తన యోగక్షేమాలని చూస్తాడని విశ్వాసము ఉండవలెను. సంశయించువాడు నశించునని గుర్తుంచుకొనవలెను. భగవంతునిపై విశ్వాసము లేని జన్మ వృథా ! భక్తికి పునాది విశ్వాసము.

## జ్ఞానము

జ్ఞాన మార్గము చాల ఉత్తమమైనది. కాని చాలా కష్టతరమైనది. జ్ఞాన మార్గము ఈదుతూ నదిని దాటుట వంటిది. భక్తిమార్గము పడవ ద్వారా నదిని దాటుట వంటిది. జ్ఞాన మార్గము నందు పోదలచినవాడు కర్మ భక్తి మార్గములలో శ్రేష్టుడై ఉండవలెను. భక్తి లేకపోతే బ్రహ్మజ్ఞానం ఎప్పుడైనను కలుగదు. జ్ఞానమంటేనేమి? యను సందేహం వస్తుంది. తన నిజ స్వరూపాన్ని తెలియజేయునదే జ్ఞానము. జ్ఞానమార్గము మర్కట కిశోర న్యాయము వంటిది.

**ఉద్ధరేదాత్మనాత్మానం మగ్నం సంసార వారిధౌ ।**
**యోగారూఢత్వమాసాద్య సమ్యగ్దర్శన నిష్ఠయా॥** (వి.చూ. 9శ్లో)

ధృఢమైన వివేకంతో నిరంతర కృషితో యోగారూఢత్వాన్ని సంపాదించి సంసారసాగరం నుండి తనను తానే ఉద్ధరించుకోవాలి.

నిష్కామకర్మ, ధర్మకార్యాలు, మనసును పవిత్రమొనర్చడానికి సహకరిస్తాయి.కాని ఇవి సత్యదర్శనానికి సహాయపడవు. వస్తుసిద్ధి సత్యవిచారణ వలన మాత్రమే సాధ్యపడుతుంది. కోటి కర్మలయినా ప్రయోజనమేమీ వుండదు. అయితే ఇచ్చట శ్రీ శంకరులు కర్మలని, ధర్మమార్గాన్ని నిరసించడం లేదు. వాటి పరిమిత తత్త్వాన్ని చూపిస్తూ వాటిని వదిలివేయకుండా వాటి నుండి ఎదిగి వేదాంతం సూచించే విజ్ఞానాన్ని అందుకోమని సూచిస్తున్నారు. నిష్కామ భావంతో కర్మచేయడం వల్ల మనస్సు పవిత్రమై శాంతిని ప్రసాది

స్తుంది. ఎప్పుడు మనస్సు శాంతిస్తుందో అప్పుడు ఏకాగ్రత పెరుగు తుంది. ఎప్పుడు ఏకాగ్రత పెరిగిందో అప్పుడు ధ్యానం కుదురుతుంది. ఎప్పుడు ధ్యానం కుదురుతుందో అప్పుడు ఆత్మానుభవం కల్గుతుంది.

**అర్థస్య నిశ్చయో దృష్టో విచారేణ హితోక్తితః ।**
**న స్నానేన న దానేన, ప్రాణాయామ శతేన వా॥** (వి.చూ.13శ్లో)

పవిత్ర తీర్థాలలో ఎన్ని స్నానాలు చేసినా, ఎన్ని దానధర్మాలు చేసినా, నూరు ప్రాణాయామములు చేసినా ఆత్మజ్ఞానం కలుగదు. గురువుల హితోక్తులను విచారించి పరమార్థాన్ని నిశ్చయంగా తెలుసుకోవడం ఒక్కటే ఆత్మజ్ఞానానికి మార్గం.

ఇచ్చట శ్రీశంకరులు పవిత్ర గంగాస్నానాలను, పూజలను, ధర్మకార్యాలను నిరసించుట లేదు. ఇవన్నీ చేసినప్పటికి గురువు చెప్పిన హితోపదేశములను అర్థము చేసుకొనక ఆచరణలో పెట్టనప్పుడు ఎన్ని పవిత్ర తీర్థాలలో స్నానం చేసినా, ఎన్ని పూజలు చేసినా ఎన్ని దానధర్మాలు చేసినా ప్రయోజనం లేదని వేదాంత విద్యార్థిని హెచ్చరిస్తున్నారు. గురువు హితోపదేశము ఒక్కటే ఆత్మానుభూతికి మార్గమని చెప్తున్నారు. మహర్షులచే నిర్దేశించబడిన విధానం మాత్రమే భవసాగరం నుండి ముక్తి కలిగిస్తుంది.

శమాదిషట్క సంపత్తి వుండాలి. ఈ అర్హత వున్నవాడే జ్ఞానమార్గానికి అర్హుడు. శుష్కవేదాంతము పలికి ఇంద్రియనిగ్రహము లేనివానికి ఈ మార్గము ముండ్లబాట వంటిది. సర్వత్రా భగవంతుని చూచుట అభ్యాసము చేయవలెను. తర్వాత తనలోనే చూడవలెను.

జగత్‌మిథ్య – బ్రహ్మసత్యం అని నమ్మవలెను.

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం – తత్పరస్సంయతేంద్రియః ।**
**జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి–అచిరేణాధిగచ్ఛతి ॥** (భ.గీ.4–39)

శ్రద్ధ ఇంద్రియనిగ్రహం కలిగియుండి జ్ఞానానుభవాన్ని లక్ష్యంగా పెట్టుకున్న సాధకుడు జ్ఞానానుభవం పొందుతాడు. జ్ఞానాన్ని పొంది శీఘ్రముగానే పరమమైన శాంతిని పొందుతాడు.

గురూపదేశంలో, శాస్త్రంలో, విశ్వాసం ఉండాలి. ఇంద్రియాలను అదుపులో నుంచాలి. ఆత్మానుభవం లక్ష్యంగా వుండాలి. ఇలా కృషిచేసి

నప్పుడే ఆత్మానుభవం కలుగుతుంది. జ్ఞానమార్గం కోటబయట వుండి శత్రువులతో పోరాడుట వంటిది. ఎన్ని శాస్త్రాలు చదివినా జ్ఞానం రాదు. రాగద్వేషాలు లేకుండా ఈ ప్రపంచాన్ని ఎప్పుడు చూడగల్గుతామో అప్పుడు ఆత్మానుభూతి కల్గుతుంది.

## ఆకర్షణలను అణగద్రొక్కుట

ఇంద్రియములు ఎల్లప్పుడు విషయ వస్తువులలో సంచరిస్తూ వుంటాయి.

**శబ్దాదిభిః పంచభిరేవ పంచ,**

**పంచత్వ మాపుః స్వగుణేన బద్ధాః ।**

**కురంగ మాతంగ పతంగ మీన**

**భృంగా నరః పంచభిరంచితః కిమ్ ॥** (వి.చూ.శ్లో.78)

ఇంద్రియాలపై మనకుండే మమకారాన్ని వాటి ఫలితము ఏవిధంగా మానవుని బంధిస్తున్నాయో ఇచ్చట శ్రీశంకరులు వివరిస్తున్నారు. ఈ బంధమే జీవితంలోని ఆనందాన్నంతటిని హరిస్తోంది.

లేడి – తన సంగీత ప్రియత్వంతో వేటగాని గానంచే ఆకర్షింపబడి అటుగా వచ్చి తన నాశనం తెచ్చుకుంటుంది. శబ్దంచే ఆకర్షింపబడి ఆ వ్యామోహంలో ముందు వచ్చిన ప్రమాదాన్ని గుర్తించలేక నాశనమవుతుంది.

కరి – మగయేనుగు ఆడయేనుగు యొక్క కర స్పర్శకు భ్రమసి దానితో పోయి గుంటలోపడి చిక్కుకొని మనిషికి పట్టుబడుతుంది.

శలభం–నిప్పు యొక్క కాంతికి ఆకర్షింపబడి దరిచేరి దహింపబడు తుంది.

చేప – నిత్యము తిండి మీద కోరిక కలిగిన చేపలు జాలరి వేసిన ఎఱ కనిపించగానే తిండి వ్యామోహంలో ప్రమాదాన్ని గుర్తించక వలలోపడి మరణిస్తాయి.

తేనెటీగ – పుష్పాల సుగంధానికి ఆకర్షింపబడి తేనెను గ్రహించి తేనె పట్టులో నిలువ చేస్తుంది. మానవుడు స్వార్థంతో తేనె కోసం పట్టుక్రింద మంట పెట్టడంతో మరణిస్తుంది. ఈ విధంగా శ్రీ శంకరాచార్యులవారు ఒక్కొక్క ఇంద్రియానికి బానిస అయి ఆయా జంతువులు ఏవిధంగా మరణిస్తు

న్నాయో వివరిస్తున్నారు. అయితే ఈ పంచ ఇంద్రియాలకి వశుడైన మనిషి గతి ఏమిటి? వివేకం వైరాగ్యంలేని మానవుడు ఈ పంచ ఇంద్రియాలకు బానిసగా విషయ వస్తువుల వైపు పరుగులు తీసినప్పుడు తన గుణాల వలన తానే బంధింపబడి నశిస్తాడు. వివేకం, వైరాగ్యంలేనివాడు భవసాగరాన్ని దాటాలని ప్రయత్నించినా, ఆశ అనే మొసలి మార్గమధ్యంలోనే కంఠాన్ని పట్టుకుని నడిసముద్రంలో ముంచుతుంది. కృష్ణ సర్పవిషం కంటె కూడ విషయ భోగాలు ప్రమాదమయినవి. విషాన్ని మ్రింగినవాడు మాత్రమే నశిస్తాడు. కాని విషయములు చూచిన మాత్రమే వినాశం సంభవిస్తుంది. బాహ్యముగా విషయములను అరికడితే చాలదు. చిత్తములో కూడ ఏ మాత్రము వాసనలు వుండకూడదు. ఈ విషయ వస్తువులు క్షణికమని, అనిత్యమని తలచి వైరాగ్యం అనే కత్తితో అంతమొందించవలెను. అట్టివారు ఈ సంసార సాగరాన్ని దాటగలరు. నిశ్చయంగా మోక్షం పొందాలి అనుకుంటే విషం వలె విషయభోగాలను త్యజించవలెను. గురువుల హితోక్తుల ప్రకారము ఎవరయితే ఆధ్యాత్మిక మార్గాన అనుక్షణము ఆత్మ పరిశీలన చేసుకుంటూ పయనిస్తారో వారు గమ్యాన్ని చేరుకోగలరు.

**ధ్యాయతో విషయాన్ పుంసః, సఙ్గస్తేషూపజాయతే ।**
**సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ॥**
**క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।**
**స్మృతిభ్రంశాద్బుద్ధినాశః, బుద్ధి నాశాత్ ప్రణశ్యతి॥** (భ.గీ. 2-62,63)

విషయ వస్తువులను ధ్యానం చేసేవానికి వాటితో సంగం కలుగుతుంది. సంగం వల్ల కామం, కామంవల్ల క్రోధం కలుగుతాయి. క్రోధంవల్ల విభ్రాంతి కలుగుతుంది. విభ్రాంతితో మతిమరుపు, దానితో బుద్ధినాశం కలుగుతుంది. బుద్ధినాశంతో వ్యక్తి సర్వనాశనం అవుతాడు.

ఇవన్నీ ఒకదానికి ఒకటి లంకె. అన్నింటికి ప్రారంభంలో వున్న విషయ వస్తువుల ధ్యానం. ఈ విషయ వస్తువుల యెడ వ్యామోహం త్యజించటమే శ్రేయస్కరము. దాహంతో గొంతు తడి ఆరిపోతున్నప్పటికీ విషం అని తెలిసిన తరువాత ఆ ద్రవాన్ని ఏ విధంగా త్రాగలేమో అదే విధంగా ఇంద్రియ విషయ వస్తువులపై మోహాన్ని త్యజించాలి.

ఇంద్రియాలను ఆకర్షణల నుండి మళ్లించడం వలన అనవసరంగా వృధా అయ్యే శక్తిని చేకూర్చుకొనకలుగుతాము. ఇలా చేకూరిన శక్తిని వెంటనే సరియైన విధానంలో వినియోగించాలి. సరియైన విధానంలో వినియోగించక పోతే మరింత శక్తితో పాత అలవాట్లలోనికి పోయే అవకాశం వుంది. దీని వలన మన వ్యక్తిత్వం పతనమయి పోతుంది. శారీరకంగా నిగ్రహం వున్నా మానసికంగా నిగ్రహంలేని యెడల మామూలు జీవితంకన్నా అధోగతికి దిగజారిపోయి ఉన్మాదులయ్యే అవకాశం వుంది. ఇటువంటి ప్రమాదాలకి లోను కాకుండా ఉండడానికి గురువు సహాయము అవసరము. మనము పొదుపు చేసిన శక్తిని ఏవిధంగా వినియోగం చేసి అత్యధిక ఫలాన్ని పొంద వచ్చునో గురువు మాత్రమే చెప్పగలడు. విషయ భోగాలను విషంవలె త్యజించి వెంటనే క్షమ, ఆర్జవం, శాంతం మొదలయిన ఈ గుణాలతో ఈ మనస్సును నింపాలి. ఈ గుణాలను అభివృద్ధి చేసుకుంటూ సర్వప్రాణులను సోదర భావంతో ప్రేమతో చూడడం ద్వారా మన వ్యక్తిత్వం విశాలమవుతుంది. ఇలా విశాలం చేసుకుంటూ సర్వత్రా సర్వవ్యాపియై ఉన్న ఆత్మ తత్త్వాన్ని గుర్తిస్తూ తాదాత్మ్యం చెందాలి. ఇలా విషయ వస్తువుల నుండి మళ్లించిన శక్తి ఆధ్యాత్మిక మార్గమువైపు వినియోగించాలి. అప్పుడు మాత్రమే అతి పవిత్రము దివ్యమైన అమృతత్త్వాన్ని పొందగలము.

## చిత్త వృత్తుల నరికట్టుటకు మాకు వలయు అంతరాధ్యాత్మిక శక్తినొసంగుము.

**"యోగశ్చిత్త వృత్తి నిరోధః"**అన్నారు. ( శ్రీ పతంజలి యోగ సూత్రములు)

రజోగుణ తమోగుణముల వృత్తులను అరికట్టడమే యోగము. రజో గుణము నుండి రాగము దుఃఖము ఉద్భవిస్తాయి. రజో గుణము వలన మనస్సులో అలజడి, అశాంతి ఉద్రేకాలు ఉద్భవిస్తాయి. ఈ మానసిక ఉద్రేకాల వలన మనం బాహ్యప్రపంచంలో కర్మలు చేస్తూ ఉంటాము. అంత రంగంలో కోరికల మూలంగా సుఖదుఃఖాలను పొందుతూ వుంటాము.

కామం, దంభం, ఈర్ష్య, అహంకారం, కోపం మొదలయిన గుణాలన్నీ రజోగుణం నుండి ఉద్భవిస్తాయి. ఈ రజోగుణం మనస్సును మహాగ్ని గుండంగా మారుస్తుంది. ఈ కర్మలన్నీ రజోగుణం నుండి పుట్టడం వలనే

రజోగుణం మనిషిని బంధిస్తుంది. రజోగుణం ఒత్తిడితో పనిచేసే వ్యక్తి తన పనులతో తానే అలసిపోయి నిద్రకు వశుడౌతాడు. ఈ నిద్ర తమోగుణం వలన వస్తుంది. అందుకే రజోగుణం తప్పకుండా తమోగుణంలోనికి జారి పోతుందని నిశ్చయంగా చెప్పవచ్చు.

తమోగుణం శక్తి – ఆవరణ శక్తి. ఈ ఆవరణ శక్తి మన నిజస్వరూపాన్ని మరుగుపరచి వేరే విధంగా చూపిస్తుంది. ఈ ఆవరణే భ్రమ కలిగిస్తూ మనిషిని జనన మరణ చక్రంలో బంధిస్తుంది. ఈ తమోగుణం సత్యానికి ఆవరణగా అడ్డుపడగా రజోగుణం మనస్సులో అలజడిని సృష్టిస్తుంది. మనస్సు రజస్తమోగుణముల పూరిత మయినప్పుడు సత్యం మనకు గోచరించదు. ఈ తమోగుణమే జన్మపరంపరకు కారణము. సత్యాన్ని గ్రహించ గలిగిన పండితులు కూడ ఈ తమోగుణానికి లోబడి తాము గ్రహించవలసిన సత్యాన్ని దర్శించలేకపోతున్నారు. సత్యాన్ని ఆవరించిన ఈ తమోగుణం అంత శక్తివంత మైనది. అజ్ఞానం, సోమరితనం, జడత్వం, నిద్ర, మూఢత్వం ఇవన్నీ తమోగుణ లక్షణాలు. ఈ లక్షణాలు వున్నవాడు దేనిని స్పష్టంగా గ్రహించలేడు. స్థంబం వలే వృధాగా జీవిస్తాడు.

సత్త్వగుణం పరిశుభ్రమయిన నీరువంటిది. అయినా రజస్తమో గుణాలు చేరియుండడం వలన జనన మరణ యుక్తమైన సంసారమునకు కారణ మవుతుంది.

సత్త్వగుణ మున్నప్పుడే బుద్ధి నిదానంగా, నిశ్చలంగా వుంటుంది. అశాంతి, అలజడి వుండదు. ఉద్రేకాలు, అలజడిలేని మనస్సు నిశ్చలంగా ధ్యానంలో వుంటుంది. సత్యాన్ని దర్శించగలదు. ఈ చిత్త వృత్తులను అరికట్టాలి అంటే రజస్తమో గుణాల్ని నిరోధించాలి. రజస్తమోగుణాలని నిరోధించాలి అంటే ఆధ్యాత్మిక శక్తి అవసరం. ఆధ్యాత్మిక శక్తి కావాలి అంటే ఆధ్యాత్మిక జీవనం గడపాలి. ఆధ్యాత్మిక శక్తి కావాలి అంటే ఆధ్యాత్మిక జీవనం గడపాలి. ఆధ్యాత్మిక జీవనం గడపాలి అంటే మనలో సత్త్వగుణము వుండాలి. ఉపాసన, స్వాధ్యాయం, జపం, ధ్యానం మొదలయిన ఆధ్యాత్మిక విధులన్నీ కూడ వ్యక్తిలోని సత్యాన్ని వృద్ధిచెయ్యడానికే ఉద్దేశించ బడ్డాయి. ఆధ్యాత్మిక సాధనల వలన మనసులో ప్రశాంతత పెరుగుతుంది. మనసులో అలజడి తగ్గినప్పుడు

ఉన్నత తత్త్వాన్ని ఆరాధించే గుణం మానవునిలో పెరుగుతుంది. బంధం నుండి పరిమితుల నుండి విముక్తి పొందాలని అనిపిస్తుంది. గర్వం లేకపోవడం, శ్రద్ధ, భక్తి, అహింస ఇవన్నీ సత్త్వగుణ లక్షణాలు. రజస్తమో గుణాలు వున్నప్పటికి సత్త్వగుణం అధికంగా వుంటే అతనిలో ముముక్షత్వం తీవ్రంగా ఉంటుంది. స్వాధ్యాయం, సత్యం, కోపం లేకపోవడం, తపస్సు ఈ లక్షణాలు వుంటేనే ఆధ్యాత్మిక జీవనము గడుపగలుగుతాము.

## కామ,క్రోధ,లోభ, ద్వేషముల బారినుండి మమ్ము తప్పింపుము

**కామః క్రోధశ్చలోభశ్చ దేహే తిష్ఠన్తి తస్కరాః ।**
**జ్ఞానరత్నాపహారాయ, తస్మాత్ జాగ్రత జాగ్రత॥** (వైరాగ్య డిండిమము)

బాహ్య వస్తువులు ఎవరైనా దొంగిలిస్తారేమోయని చాలా చాలా జాగ్రత్తలు తీసుకుంటాము. కాని ఈ దేహమను భవనమున కామము, క్రోధము, లోభములను దొంగలు నివసించుచున్నారు. జ్ఞానమనే రత్నమును దొంగిలిస్తున్నారు. కావున మేలుకొనుడు. మేలుకొనుడు బాహ్య వస్తువులు ఎవరైనా దొంగిలించిన సొమ్మును తిరిగి సంపాదించవచ్చు. కాని జ్ఞానమనే రత్నమును అపహరించిన తిరిగి సంపాదించలేము. కావున మేల్కొనుము.

కామము వలన - రావణాసురుడు నాశనమయ్యెను.

లోభంవల్ల - దుర్యోధనుడు వినాశము పొందెను.

ద్వేషము - ఇదిచాలా ప్రమాదమైనది. ఇతరుల ఉన్నతిని చూచి వారిని అకారణంగా ద్వేషించడము. ద్వేషము వలన క్రోధము కలుగును. క్రోధము వలన సర్వనాశనము కలుగును. తన క్రోధమే తనకు శత్రువు. కోపం మనిషికి ఆవేశం కల్గిస్తుంది. తానెవరో మర్చిపోతాడు. ఆ క్షణంలో వివేకం నశిస్తుంది. వివేకం లేనివాడు పతనము చెందుతాడు. కామక్రోధలోభద్వేషముల బారినుండి తప్పించుటకు మనస్సును శుద్ధసంకల్పములవైపు మరల్చవలెను. శుద్ధసంకల్పములు మనస్సును పవిత్రమొనర్చి హృదయము విశాలమొనర్చును.

## మా హృదయ ఫలకములను సద్గుణములతో నింపివేయుము

**కులములోన నొకడు గుణవంతుడుండెనా**
**కులము వెలయు వాని గుణముచేత,**
**వెలయు వనములోన మలయ జనంబున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

ఏ సద్గుణాలు వుంటే మానవుడు భగవంతునికి దగ్గరవుతాడో భగవానుడు వివరించెను. అభయం, సత్త్వసంశుద్ధి, జ్ఞానయోగంలో నిలవడం, దానం, దమము, యజ్ఞము, స్వాధ్యాయము, తపస్సు, నిజాయితీ, అహింస, సత్యం,క్రోధం లేకపోవడం, త్యాగము, శాంతి కొండెములు చెప్పకుండుటయు, భూతదయ, విషయములందు మనస్సు వ్యాపింపకుండుటయు, మృదు స్వభావం, ధర్మ విరుద్ధ కార్యములలో సిగ్గు, చంచల స్వభావం లేకుండుట. తేజస్సు,క్షమ, దృఢమైన పట్టుదల, శుచిత్వం, పరులకు హాని కలుగజేయక పోవడం, అభిమాన రాహిత్యము, ఈ సద్గుణములన్నీ దైవసంపద. ఇటువంటి సద్గుణాలు ప్రసాదించమని భగవంతుని ప్రార్థించాలి. సద్గుణాలవల్ల వచ్చే ప్రయోజనం ఏమిటి అంటే సమాజములోను శాంతి ఉంటుంది. మరియు మనము భగవంతుని దగ్గరకు చేరుకుంటాము.

## ఈ సర్వనామ రూపములలో నిన్ను తిలకింపనిమ్ము

**"ఈశ్వరః సర్వభూతానామ్"** (భ.గీ18-61) ప్రతీప్రాణిలో భగవంతుడు ఉన్నాడు. అందుచే ప్రతీప్రాణిలో భగవంతుని చూడవలెను. ఏ ప్రాణినైనను ద్వేషభావ ముతో చూచిన యెడల భగవంతుని ద్వేషించినట్లే ! ప్రతీప్రాణి భగవత్ స్వరూపమే కనుక ప్రతీప్రాణిలో భగవంతుని చూచిన యెడల అమృతత్త్వమును పొందెదవు.

## ఈ సర్వనామ రూపములలో నిన్ను సేవింపనిమ్ము

**"పాదోస్య విశ్వా భూతాని"** అని శ్రుతి పలుకుచున్నది. భగవంతునిలో (1/4) నొక పాదము ఈ విశ్వములోని భూతములన్నియునై యున్నవి. ఎవ్వరిని సేవించినా భగవత్ స్వరూపులే అని భావించి సేవింపవలెను. సర్వభూతములను సేవించుటయే భగవత్ సేవ యగును. నిష్కామ బుద్ధితో సేవ చేయవలెను. అందరునూ నారాయణ స్వరూపులే. అందుచే

మహాత్ములందరును దీనులను నారాయణ భావంతో సేవ చేస్తూ నారాయణ సేవ అని వచించెదరు.

ఉదా:- శ్రీ ఏకనాథుడు రామేశ్వరములోనున్న శివలింగమునకు అభిషేక నిమిత్తమై కాశీ నుండి గంగా జలమును తీసుకుని పోవుచుండెను. మార్గమధ్యమందున ఒక గాడిద దాహముచే బాధపడుచుండెను. ఆ బాధను చూచి ఆయన మనస్సు ద్రవించి పోయెను. పవిత్ర గంగాజల మును గాడిద నోటిలో పోసి దాని దాహమును తీర్చి పరమేశ్వరుని అభిషేకించినట్లు పరమానందించెను. గాడిదలో కూడ ఏకనాథుడు పరమేశ్వరుని దర్శించెను. మానవసేవయే మాధవసేవయని భావించి సేవ చేయవలెను. ఏ ప్రాణిని హింసించినా భగవంతుని హింసించినట్లే యగును.

## నిన్ను సదా స్మరించుకొననిమ్ము

ఎల్లవేళల యందు భగవంతుని స్మరించవలెను. కృత, త్రేతా, ద్వాపర యుగములలో వలే మనము తపోదానయజ్ఞములు చేయలేము. కావున కలియుగమునకు మహాత్ములు "కలౌ స్మరణాన్ ముక్తిః" కలియుగములో స్మరణముచేత ముక్తిపొందుట సులభ మార్గమని సూచించిరి.కావున స్మరణము చేయవలెను. స్మరణము ద్వారా భవసాగరము నుండి ముక్తి పొందవచ్చును. భగవంతుని స్మరణ ఎన్నడు నిర్లక్ష్యం చేయకూడదు. భగవంతుని మరచిపోవ డమే ఆధ్యాత్మిక దృష్టిలో మరణము. భగవంతుని నిత్యమూ స్మరించుట వలన మనస్సు పవిత్రమై భగవంతునికి దగ్గరవుతాము.

## నీ లీలలు సదా గానము చేయనిమ్ము

సర్వవేళల యందు భగవంతుని గుణలీలలను గానము చేయవలెను. భగవంతుని గుణములను గానము చేయునప్పుడు వాటి అర్థమును గ్రహించ వలెను. కట్టెలను అగ్ని దహించునట్లు పాపములన్నియు భగవంతుని లీలలు గానము చేయుటచే నశించును. బాహ్య విషయముల నుండి మనస్సును మళ్లించుటకు భగవంతుని లీలలు గానము చేయుట సులభమైన మార్గము. ఏ పనిలో ఉన్నా భగవంతుని లీలలు గానము చేయుట ద్వారా మనస్సులో విషయ వాసనలు దూరమై మనస్సు నిర్మలమై ధ్యాన స్థితికి చేరుకుంటుంది.

## నీ నామము సదా మా పెదిమలపై నుండనిమ్ము

ద్వాపరాంతము నందు నారదుడు బ్రహ్మ దగ్గరకు వెళ్లి యిట్లడిగెను. హే భగవాన్ నేను ఎల్లప్పుడునూ భూలోకములో తిరుగుచుందును. కలిలో తరించుట యెట్లు ? ఇచ్చట నారదుని గురించి ప్రశ్న అడగలేదు. కలియుగ మానవులు అల్ప ఆయువు గలవారు, మందబుద్ధులు, అశక్తులు, అన్నగత ప్రాణులు. ఇటువంటి కలియుగ మానవులు తరించుటకు సులభమైన మార్గము. ఏదైనా కలదా ! అని నారదుల వారు బ్రహ్మను అడిగెను. బ్రహ్మ ఇట్లు చెప్పెను. నీవు చాలమంచి ప్రశ్న వేసితివి. దేనిచేత భవసాగరము దాటవచ్చునో యట్టి సర్వవేదసారమైన దానిని వినుము.

**హరేరామ హరేరామ రామరామ హరేహరే ।**

**హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే ॥**

ఈ పదియారు నామములు కలిలోని కల్మషములను నశింపజేయును. దీని వలన అజ్ఞాన ఆవరణ నశించును. మేఘములు నశించగా సూర్యకిరణములు ప్రకాశించునట్లు అజ్ఞానము నశించగా పరబ్రహ్మము ప్రకాశించును.

మరల నారదుడు ఇట్లు ప్రశ్నించెను. హే భగవాన్! దీని నియమమేమి? అప్పుడు బ్రహ్మ యిట్లు చెప్పెను. ఈ మంత్రమును జపించుటకు నియమము ఏమియులేదు. సదా జపించవచ్చును. జపము ద్వారా ముక్తిని పొందవచ్చును.

కలియుగము దోషముల మయము. అయినా నందొక మహా గుణము ఉన్నది. ఆత్మసాక్షాత్కారము పొందుటకు భగవంతుని నామము జపించుట అత్యంత సులభమైన మార్గము. ఇంద్రియములను బాహ్య విషయవస్తువుల నుండి మరలించి మనస్సును ఒక ఉన్నతమైన విషయము పైన నిలపడం కోసం చేసే ప్రయత్నమే జపము. ప్రారంభ దశలో ధ్యానము చేయుట కష్టతరమైనది. అస్తవ్యస్తంగా చేసే ధ్యాన పద్ధతుల కంటే జపము చేయడము శ్రేష్ఠమైనది. జపము ద్వారా మనస్సునకు ఏకాగ్రత కుదురుతుంది. ఎప్పుడయితే మనస్సునకు ఏకాగ్రత కుదురుతుందో అప్పుడు మనస్సు ప్రశాంతత పొందుతుంది. ఈ విధంగా ప్రశాంతత పొందిన మనస్సు, కొద్దిపాటి ధ్యానాభ్యాసంతో సాధకున్ని ఉన్నతమైన స్థానమునకు తీసుకెలుతుంది. ఆధ్యాత్మిక మార్గములో జపము చాలా ఉన్నతమైన మానసిక శిక్షణ.

"యజ్ఞానాం జప యజ్ఞోస్మి" (భ.గీ.) అన్నారు. త్యాగరాజు స్వామివారు రామనామము జపముచేసి పరిపూర్ణతను పొందిరి. అనుక్షణం భగవంతుని స్మరించడము వలన ఆయనతో తీరని అనుబంధం పెరిగి ప్రపంచ విషయ ముల నుండి మమకారము తగ్గుతుంది. శ్రీకృష్ణుడు గోపికలను విడచి వెళ్లినపుడు ప్రతీచెట్టు నందునూ, ప్రతీ అణువునందును శ్రీకృష్ణుని దర్శించిరి. జపము మానసిక, ఉపాంశు, వైఖరి అనిమూడు విధములుగా గలదు.

**1. మానసిక జపము :** మనస్సులో జపించుట.

**2. ఉపాంశు :** పెదవులను కదలించి చేయు జపము.

**3. వైఖరి :** గట్టిగా ఉచ్చరించి చేయు జపము.

గట్టిగా ఉచ్చరించిచేయు జపము కంటె మానసిక జపము చాలా శ్రేష్ట మైనది. బ్రహ్మ ముహూర్తమున జపము చేయుట శ్రేయస్కరము. బ్రహ్మ ముహూర్తములో నిద్రించిన చేసిన పుణ్యము నశించును. మన ఇష్టదైవమంత్ర మును జపము చేసుకొనవచ్చును. మంత్రములన్నియు శాస్త్రాల్లో కలవు. అయితే అనుభవజ్ఞానం, బ్రహ్మానుభూతిపొందిన గురువు శిష్యునకు మంత్రదీక్ష ఇచ్చినప్పుడు ఆ మంత్రం మహాశక్తివంతమవుతుంది. తన ఆధ్యాత్మిక శక్తితో గురువు ఆ మంత్రానికి ప్రాణం పోస్తాడు. అదే విధంగా శిష్యునిలో నిద్రాణమై ఉన్న ఆధ్యాత్మిక శక్తుల్ని ఉత్తేజపరుస్తాడు. ఇదే గురూపదేశంలోని పరమ రహస్యం. నిరంతరము మంత్రజపం చేయుట వలన మహత్తరమైన శక్తి కలిగి, ఆధ్యాత్మిక స్పందన మనలో కలుగును. ప్రారంభదశలో మానసికంగా జపము చేయుట కష్టం. భగవంతుని ప్రతిమను చూస్తూ జపము చేయాలి. మనస్సు ఇతర విషయములపై పోతుంది. ఆ సమయములో నిరుత్సాహ పడకుండా బిగ్గరగా జపము చేసి సాధకుడు దానిని గ్రహించి మనస్సును జపములోనికి తీసుకురావడానికి ప్రయత్నించాలి. మంత్రజపము నకు ఎటువంటి దేశకాల నియమము లేదు. ఎల్లప్పుడును జపము చేయ వచ్చును. రాముని కన్న రాముని నామమే గొప్పదని నిరూపించబడెను.

ఉదా:- జనాబాయి తాను ఆవుపేడతో చేసిన పిడకలు ప్రక్కింటి ఆమె తీసుకువెళ్లిందనీ ఆవిడతో తగవులాడుతుంది. ఈ సన్నివేశాన్ని చూస్తున్న భక్త కబీర్‌దాస్ ముందుకు వచ్చి "అమ్మా! జనాబాయి! నీవు నీ పొరుగింటి

ఆమె ఇద్దరూ పిడకలు తయారు చేసారు. ఆమె తీసుకున్న పిడకలు నీవు చేసినవని ఎలా చెప్పగలవు?" అని ప్రశ్నించారు. అందులకు జనాబాయి మహాత్మా! భక్తులు, ధన్యజీవులు. న్యాయమెవరిదో మీరే తీర్పు చెప్పాలి. నేను పిడకలు చేయునప్పుడు నా ఇష్టదైవమయిన పాండురంగని నామజపం చేస్తూ చేసాను. మీరు నేను తయారు చేసిన పిడకలను చెవిదగ్గర ఉంచుకోగానే అవి పాండురంగ నామాన్ని వినిపిస్తాయి అని చెప్తుంది. కబీర్‌దాస్ పరీక్షచేసి చూస్తారు. "పాండురంగవితలా" అని దివ్యమైన నామాన్ని వినిపిస్తాయి. ఈవిధంగా జనాబాయి పాండురంగని నామము జపిస్తూ అమృతత్త్వాన్ని పొందినది. మనకి సందేహం వస్తుంది. ఎప్పుడూ నామజపం చేస్తూవుంటే మా జీవనోపాధి ఎట్లా అని ? మన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఏ పనిలో వున్నా భగవంతుని నామము చేయవచ్చును. భగవంతుని నామము జపిస్తూ పనిచేసిన యెడల అలసట వుండదు. ఆనందంగా ఉల్లాసంగా మనసు ఉంటుంది. స్త్రీలు వంటచేసినప్పుడు నామజపం చేస్తూ వంటచేస్తే అటువంటి ఆహారం సాత్విక ఆహారమవుతుంది. కూరలు తరిగినప్పుడు అందులో పుచ్చినవి పారవేస్తాము. అదేవిధంగా మనం కూరలు తరిగినప్పుడు మనలో వున్న దుర్గుణములు నాశనము కావాలి అనే భావనతో నామజపం చేస్తూ కూరలు తరగాలి. ఇల్లు ఊడ్చినప్పుడు మనలో వున్న చెత్తను పారవేస్తున్నాము అని భగవంతుని భావనతో పనిచేయాలి. చపాతి చేస్తున్నప్పుడు మన హృదయాన్ని విశాలము చేస్తున్నాము అనే భావనతో చేయాలి. ఈ విధంగా నిరంతరము భగవన్నామం జపం చేస్తూ వుండాలి. ఈ విధంగా భగవన్నామముతో తయారు చేసిన ఆహారము స్వీకరించిన యెడల మనస్సులో మంచి సంకల్పములు కలిగి పవిత్రమగును. ఎట్టి వంటో, అటువంటి బుద్ధి అన్నారు మహాత్ములు. ఆంజనేయుడు సముద్రాన్ని దాటగలిగాడంటే అతనిలో ఏ శక్తి వున్నది? అతడు సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించడానికి కారణము రామనామ శక్తియే కాని వానరశక్తి కాదు. సుధాముడు దరిద్రంతో వున్నప్పటికిని ఎల్లప్పుడునూ కృష్ణనామము జపిస్తూ భగవత్ సాక్షాత్కారాన్ని పొందాడు. ఒకే వ్యక్తి ఒకరికి తాత, మామ, అన్నయ్య అని వేరు వేరుగా ఏవిధంగా వర్తిస్తారో అదేవిధంగా భగవంతునిలో శివకేశవులైనా, మరే నామమైనా భేదము లేదు. ఏ నామమైనా ఒక్కటే గమ్యానికి చేర్చుతుంది.

ధ్యానస్థితికి చేరుకోవాలి అంటే పటిష్టమైన సాధనం జపం. జపము అంటే గ్రామ్‌ఫోన్ రికార్డులాగ పెదిమల ద్వారా వల్లించడమే కాదు, జపము శారీరకమైనది కాదు మానసికంగా లోతుగా పోవాలి. కేవలం పూసలు త్రిప్పడం కాదు. జపసాధనని శుద్ధమయిన మనస్సుతో తైలధారవలె చెయ్యాలి. శరీర మనోబుద్ధులను భగవంతుని వద్ద అర్పించాలి. హృదయంలో అన్యమైన చింతలు లేకుండా దేవుని రూపాన్ని ప్రతిష్టించుకోవాలి. ప్రారంభంలో అతిగా అభ్యాసం చేయకూడదు. రోజు రోజుకి క్రమేణ ఎక్కువగా చేయడం అభ్యసించాలి. ఈ విధంగా నెమ్మదిగా రోజూ అభ్యాసము చేస్తూ వుంటుంటే కొంత కాలానికి మనము ఏ స్థితిలో వున్నా కూడా మానసికముగా జపము చేయగలము. మానవుడు చేసే ప్రతీపనిలోను ఫలితాన్ని గురించిన కోరిక వుంటుంది. జపంలో కూడ ఫలితాల మీద దృష్టి వున్నదా సాధకునికి ఆధ్యాత్మిక పురోగతి వుండదు. నిష్కామంగా చిత్తశుద్ధితో ఏ విధమైన కోరికలు లేకుండా భవసాగరము నుండి తరించి పూర్ణమైన అమృత స్వరూపాన్ని పొందుటకు జపము చెయ్యాలి.

## నీలో సదా మమ్ము వసింపనిమ్ము

అజ్ఞానముతో జీవుడు ఆత్మను నేనేయని భ్రమలో పడతాడు. అజ్ఞానమును నిర్మూలించి ఈ జీవాత్మను పరమాత్మతో ఐక్యము చేయుటకు ప్రయత్నించాలి. ఇదియే మానవుని యొక్క జీవిత పరమ లక్ష్యము. నిష్కామ సేవ, స్వాధ్యాయము, జపము ద్వారా మన మనస్సును పవిత్రమొనర్చిన పిదప నిరంతర తైలధారవలె ధ్యానసాధన ద్వారా అమృతత్త్వము పొందగలము. జరా –మరణ దుఃఖము నుండి ముక్తి కలుగుటకు ధ్యానము మాత్రమే సక్రమమైన పూలబాట. ధ్యానము సమస్త దుఃఖములను నిర్మూలించును. ధ్యానములో పరిపూర్ణమైన స్థితిని పొందినవారు ఎన్ని దుఃఖములు వచ్చినను వారి మనస్సు కలత చెందదు. మనస్సును సామ్య స్థితిలో నుంచగలరు. సుఖ దుఃఖములు, మానావమానములు మనస్సునకు ఒకే విధముగా కనిపించును.

**ధ్యానము అంటే ఏమిటి ?**

సంకల్ప వికల్ప రహితమైన స్థితి. మనస్సులో ఎటువంటి ఆలోచనలు లేని స్థితి.

## ధ్యానము ఏవిధంగా చెయ్యాలి ?

మనలో వున్న పరమాత్మ వద్దకు తీసుకు వెళ్ళే చివరి సోపానం ధ్యానం. నిర్గుణ, నిరాకార తత్త్వానికి ప్రతీకమైన మన ఆరాధ్య దైవాన్ని గాని లేక ఓంకారాన్ని గాని ఎదురుగా వుంచి ధ్యానము ప్రారంభించాలి. ప్రారంభదశలో ప్రణవ మంత్రముగాని, ఇష్టదైవ మంత్రాన్నిగాని గట్టిగా ఉచ్ఛరించి (వైఖరి) చేయు జపము చెయ్యాలి. పిదప (ఉపాంశు) పెదవులను కదిలించి జపము చెయ్యాలి. పిదప మానసిక జపము చేయాలి. చివరికి మానసిక జపము కూడ ఆపివేసి మనస్సులో ఆలోచనలు లేని స్థితిలో ఎంత సమయము ఉండగల్గుతుందో అంత సమయము వుంచాలి. ఈ నిశ్శబ్దమునుండి ఆలోచనా రహిత స్థితికి భంగం కల్గుతుంది. తిరిగి ప్రణవ జపముగాని ఆరాధ్యదైవ మంత్రముగాని జపిస్తూ ఎట్టి ఆలోచనలులేని స్థితికి మనస్సును తీసుకు రావాలి. నెమ్మదిగా ప్రయత్నించాలి. ప్రారంభ దశలో వాసనల మూలమున ఆలోచనలు వస్తాయి. ధ్యానము నందు తొందరపాటు పనికిరాదు. మనస్సు పులిలాంటిది. దానిని నెమ్మదిగా మచ్చికచేసి దారిలోనికి తీసుకురావలెను. దేనికి జాతి నీతి కులగోత్రం వుండవో, దేనికి నామరూప గుణములు వుండవో, ఏది దేశకాల విషయములకు వేరైనదో ఆ బ్రహ్మమే నీవని నీ హృదయంలో ధ్యానించమని శ్రీ శంకరులు చెప్పిరి. బ్రహ్మమే తన లక్ష్యంగా పెట్టుకుని ధ్యానించాలి. బ్రహ్మము నేను ఒక్కటే అని, నాకన్నా వేరుగా వున్నది లేదని బ్రహ్మ భావంతో దృఢంగా నిలచిఉండాలి. దుఃఖ కారణమైన అనాత్మ చింతనను విడచి పరమమైన ఆత్మను ధ్యానించాలి. ఆత్మే బ్రహ్మ, ఆత్మే విష్ణువు, ఆత్మే ఇంద్రుడు, ఆత్మే శివుడు. ఈ విశ్వమంతా ఆత్మేతప్ప రెండవది లేదని నిశ్చయ భావంతో వుండు. ఈ విధంగా వున్నదంతా బ్రహ్మము ఒక్కటేనని శరీర మనోబుద్ధులచే శ్రమించి బ్రహ్మానుభూతి కలిగినంత వరకు తన నిజస్వరూపమైన పరం ధామాన్ని చేరుకునే వరకు విసుగు చెందకుండా ప్రయత్నం చేస్తూ వుండాలి.

## ధ్యానానికి అవరోధాలు

శారీరక సుఖభోగాలను అనుభవించుతూ ఆత్మసాక్షాత్కారం పొందాలనుకునేవాడు ఎటువంటి ప్రమాదానికి గురి అవుతారో శ్రీశంకరులు హెచ్చరిస్తు

న్నారు. నదిలో మొసలిని బల్లచెక్కగా పొరబడి దాని మీద నదిని దాటుటకు ప్రయత్నించిన వానికి ఏ గతివస్తుందో అదే విధంగా శరీర తాదాత్మ్యం గల వాడు ఆత్మసాక్షాత్కారానికి దూరమవుతాడు. ప్రారంభదశలో సాధకునికి శరీర ధ్యాస వుంటుంది. అందుకని శ్రీశంకరులు హెచ్చరిస్తున్నారు.

**ప్రారబ్ధం పుష్యతివపుః ఇతి నిశ్చిత్య నిశ్చలః ।**

**ధైర్యమాలంబ్య యత్నేన స్వాధ్యా సాపనయం కురు॥** (వి.చూ.శ్లో.279)

ఈ శరీరం పైన ఎపుడైతే ఆత్మృత మొదలవుతుందో అదియే సాధకుని సంసారం. మన ప్రారబ్ధం మనశరీరాన్ని తప్పకుండా పోషిస్తుందని నిశ్చయంగా తెలుసుకొని శాంతంగా ధైర్యంగా జీవనయాత్ర సాగించాలి. మనస్సులో వచ్చే అలజడులను దూరం చేయాలి. **"తత్త్వమసి"** మొదలగు మహావాక్యాల వలన మనలో వున్న ఆత్మే, సర్వత్ర బ్రహ్మంగా వుందని గ్రహించాలి. మాతాపితరుల మలిన పదార్థాలనుండి ఈశరీరం నిర్మింపబడినది. మలమాంస పూరితమయిన ఈ శరీరాన్ని, చండాలుని దూరంగా వుంచినట్లు హేయభావంతో చూడాలి. స్వస్వరూపమైన బ్రహ్మ స్థితిని గుర్తు తెచ్చుకుంటూ జీవితాన్ని ధన్యం చేసుకొని బ్రహ్మానుభవము పొందమని శ్రీశంకరులు చెప్తున్నారు. ఇట్టి బ్రహ్మానుభవము పొందినవాడు సచ్చిదానంద స్వరూపుడవుతాడు.

ఇచ్చట శంకరులు శరీరాన్ని నిర్లక్ష్యం చెయ్యమని సూచించడం లేదు. శరీర తాదాత్మ్యముతో కాలము వ్యర్థము చేయరాదని, ఈ శరీర తాదాత్మ్యం వదలి భగవంతుని ధ్యానించి అమృతత్త్వాన్ని పొందమని సూచిస్తున్నారు. భక్తి, విశ్వాసము, కరుణ, నిష్కామ సేవ, పరిశుద్ధమయిన హృదయము ఇవన్నీ ధ్యానమునకు సోపానములై వున్నవి. ఈ బ్రహ్మానుభూతి పొందుటయే (నీలో సదామమ్ము వసింపనిమ్ము) అను వాక్యమునకు భావము.

శ్రీ శివానంద సరస్వతి మహరాజ్ వారు వ్రాసిన విశ్వప్రార్థన సామాన్యమైన ప్రార్థనగా అనిపించవచ్చును. వారు వ్రాసిన ప్రార్థనలో అంతరార్థము గ్రహించి ఆచరణలో పెట్టగలిగినచో మన జీవన గమ్యమును చేరుకొనగలము. ఈ ప్రార్థన యాంత్రికముగా చేస్తే ప్రయోజనము లేదు. భావయుక్తంగా ప్రార్థించాలి.

కొన్ని చిలుకలు ఒక పాట నేర్చుకున్నాయి. "బోయవాడు వస్తాడు, గింజలు చల్లుతాడు, వలపన్నుతాడు, మనం వలలో చిక్కుకొనవద్దు" అని ఎల్లప్పుడు పాడుతూ ఉండేవి. ఒకరోజు బోయవాడు వచ్చాడు, గింజలు చల్లాడు, వలవేసాడు. చిలుకలన్నీ యథాప్రకారము "బోయవాడు వస్తాడు, గింజలు చల్లుతాడు, వలపన్నుతాడు, మనం వలలో చిక్కుకొనవద్దు" అని పాడుతూ గింజలకోసం వలలోవచ్చి చిక్కుకొని బోయవాని వశమయి పోయాయి.

యాంత్రికంగా చేసే ప్రార్థన ద్వారా వచ్చే ప్రయోజనము ఎలాంటిదంటే చిలుకలు వలలో చిక్క గూడదంటూనే చిక్కుకున్నట్లుగా మనము కూడ విషయవస్తువులు అనే వలలో చిక్కుకొని పతనమయినట్లుంటుంది.

ఈ చిలుక ఎవరో కాదు జీవుడే;

గింజలు విషయ వస్తువులు;

బోయవాడు అజ్ఞానం.

స్వామీజీ వారు వ్రాసిన "విశ్వప్రార్థన" చేస్తూ ప్రార్థనలోని అంతరార్థ మును గ్రహించి వారి ప్రార్థన ద్వారా అందించిన సందేశం ప్రకారం సాధ కుడు శ్రద్ధ వహించి తగిన కృషిచేసి తన జీవితములో ఆచరణలో పెట్టగల్గిన, మహాత్ములు పొందిన శాశ్వతమైన, పరమానందమయిన పరంధామాన్ని చేరుకోగలరు.

ఈ ప్రార్థనలో అంతా మాకు ప్రసాదింపుము అని స్వామీజీ వారు వ్రాసిరి. అంటే ఈ ప్రార్థన వ్యక్తిగత ప్రయోజనమునకు మాత్రమే ఉద్దేశింప బడలేదు. ఎవరైనా సరే ప్రార్థన ద్వారా జనన మరణ భవసాగరము నుండి ముక్తి పొందవచ్చును అనే భావన వ్యక్తమౌతుంది.

ఈ ప్రార్థనలో చెప్పినవి మేము ఆచరించడము లేదు కదా ! ఈ ప్రార్థన ఎందుకు చేయుటము అనుకోకూడదు. నిత్యము చేస్తూ వుంటే ఏదో ఒక దినము ఆచరించవలెనని సత్ సంకల్పము కలిగి ఆచరించగ గల్గుతాము.

హరిః ఓం తత్ సత్ !

–×××–